ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

| మంగళవారం, మార్చి 24, 2026 | సంపుటి - 22 | సంచిక 176 | వెల - 7 | పేజీలు - 12 - 8 |
|---|---|---|---|---|

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

- యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు
- లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

6

**న్యూఢిల్లీ, నినాదం:** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు.





# మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ

## హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి


- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలో మీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు.. మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

వివరాలు 2

*ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు.*

**హైదరాబాద్,మార్చి23(నినాదం):**

కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని సీఎం తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు.



## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

*విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు.*

## రేపు జీవన్ రెడ్డి రాజీనామా..!

- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానానికి తెర
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 23 (నినాదం):** ఢిల్లీ అధిష్ఠానం వ్యవహారశైలిపై జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కష్టకాలంలో పార్టీని నిలబెట్టిన నాన్–కరప్టెడ్ సీనియర్ లీడర్లను పక్కనబెట్టి, ఫిరాయింపు నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి విషయంలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న వైఖరి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. జీవన్ రెడ్డి రాజీనామా చేసిన వెంటనే ఆయనను తమ వైపుకు తిప్పుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహాలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.





### నాలుగు దశాబ్దాల ప్రస్థానానికి ముగింపు

1984లో ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లో చేరిన జీవన్ రెడ్డి, బుధవారం అధికారికంగా రాజీనామా చేయనున్నారు. జగిత్యాలలోని బందారి గార్డెన్‌లో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గత 20 నెలలుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఆయనను తీవ్ర మానసిక ఆవేదనకు గురిచేశాయని అనుచరులు చెబుతున్నారు. సర్దుకుపోయే ప్రయత్నాలు చేసినప్పటికీ, పదవులు మరియు అవకాశాల విషయంలో పక్కన పెట్టారని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇచ్చి, సీనియర్లను నిర్లక్ష్యం చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

▸▸తరువాయి 2లో..

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

నిందితులకు మూడురోజు పోలీస్ కస్టడీ

2



## ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన

### తగ్గిన క్రూడాయిల్ ధరలు..పెరిగిన పసిడి

**వాషింగ్టన్, నినాదం:** అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేయడం.. ప్రతిగా తాము హర్మూజ్ పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరికలతో యుద్ధం ఎటు వెళ్తుందోనన్న భయాలు నెలకొన్నాయి.

2

## టెహ్రాన్‌లో చర్చలు జరుపుతున్నాం

ముఖ్యమైన నేతలతోనే ఇవి కొనసాగుతున్నాయి ట్రంప్

### తోసిపుచ్చిన ఇరాన్

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

- రైతుబంధును 15 వేలు అని,12వేలకు కుదింపు
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?
- బడ్జెట్‌పై చర్చలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

2



**హైదరాబాద్,మార్చి23(నినాదం):** గతంలో బీఆరఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు.

## పీడీఎస్ రైస్ స్మగ్లింగ్ చేస్తే చర్యలు

### మిల్లర్లకు కలెక్టర్ సీరియస్ వార్నింగ్

### నినాదం కథనాలతో కదలిక

**ఆసిఫాబాద్,మార్చి23(నినాదం):**

పీడీఎస్ రైస్ స్మగ్లింగ్ కు పాల్పడవద్దని రైస్ మిల్లర్లను జిల్లా కలెక్టర్ కె హరిత హెచ్చరించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని కొన్ని రైస్ మిల్లులు అదే పనిగా పీడీఎస్ రైస్ స్మగ్లింగ్ కు పాల్పడుతున్నాయని 'నినాదం'దినపత్రిక గత కొద్ది రోజులుగా ఆధారాలతో కూడిన వరుస కథనాలు ప్రచురించింది. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ ఆయా మిల్లుల బాధ్యులను పిలిపించి మందలించినట్లు తెలిసింది.పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే తీవ్రమైన చర్యలుంటాయని వార్నింగ్ సైతం ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిణామమైనా ఇక్కడి నిరంతర పీడీఎస్ దందాకు అడ్డుకట్టవేస్తుందోలేదో వేచిచూడాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



## సిర్పూర్ ఎస్సై బదిలీ

### నూతన ఎస్సైగా డి.సాగర్

**కాగజ్ నగర్,మార్చి23(నినాదం):**

సిర్పూర్ (టి) ఠాణా ఎస్సై సురేష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్సైగా డి. సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు సేవలుంటాయని సాగర్ తెలిపారు. అదేవిధంగా ఎవరు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డా సహించేదిలేదని,చట్టపరిధిలో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టంచేసారు. కాగా స్థానిక పీడీఎస్ స్మగ్లింగ్ పై నినాదం వరుస కథనాల నేపధ్యంలో ఎస్సై బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్

- ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్..
- ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
- ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

2



## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత

### అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బిఆర్ఎస్ నోటీసు

**హైదరాబాద్,మార్చి23(నినాదం):**

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆరఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం క్రుష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.




బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

- ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం
- తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం

2

*రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము... ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది.*

## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

### కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు విచారణ




**న్యూఢిల్లీ, నినాదం:** తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ పొడిగింపునకు సంబంధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది.

2

### మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కుమార్తెలకు రోడ్డు ప్రమాదం

5

**హైదరాబాద్:** నగర శివారులోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ORR)పై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో ఆయన పెద్ద కుమార్తె పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

## భార్యపై అనుమానం..

### ఆవేశంతో హత్యచేసిన భర్త

2

*అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన మాట వినడం లేదని, ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను అత్యంత కిరాతకంగా చంపాడో భర్త.*

## ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటన

అయితే అనూహ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కాల్పుల విరమణ ప్రకటించారు. ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేయాలని తమ బలగాలను ఆదేశించినట్లు చెప్పారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పతనం కాగా.. తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ ఇరాన్‌పై దాడులను తాత్కలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 13 శాతం మేర పతనమై 96 డాలర్ల స్థాయికి చేరింది. అంటే ఒక్క ప్రకటనతో 17 డాలర్ల మేర దిగొచ్చింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సైతం 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు సోమవారం ఉదయం భారీగా పతనమయ్యాయి. ద్రవ్యోల్బణ భయాలు, డాలరు బలోపేతం కావడంతో వీటి విలువలు భారీగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ఓ దశలో 4099 డాలర్లకు చేరింది. ట్రంప్ ప్రకటనతో మళ్లీ బంగారం పుంజుకొంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 4474 డాలర్లకు చేరింది. వెండి ఔన్సు 70 డాలర్లకు సవి□పించింది. ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల ఓ దశలో రూ.1.36 లక్షలు పలకగా.. రాత్రికి మళ్లీ రూ.1.46 లక్షలకు చేరింది. వెండి కిలో రూ.2.10 లక్షల నుంచి రూ.2.32 లక్షలకు పెరిగింది. ఇదే ప్రకటన స్టాక్ మార్కెట్ ముగియక ముందు వచ్చి ఉంటే మన మార్కెట్‌లు కూడా భారీ నష్టాల నుంచి గట్టెక్కి ఉండేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గిఫ్ట్ నిఫ్టీ ప్రస్తుతం 920 పాయింట్లకు పైగా లాభంతో 23,391 వద్ద ట్రేడవుతోంది. ఈ లోపు ఎలాంటి ప్రకటనా రాకపోతే మంగళవారం మన మార్కెట్లు దూసుకెళ్లడం ఖాయం అని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

## టెహ్రాన్‌లో చర్చలుజరుపుతున్నాం

వాషింగ్టన్, నినాదం: పశ్చిమాసియాలో యుద్ధాన్ని నిలిపివేసే విషయమై రెండ్రోజులుగా ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారంనాడు ప్రకటించడం, అలాంటిదేమీ లేదంటూ ఇరాన్ తోసిపుచ్చడంపై తాజాగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇరాన్ స్పందన అనంతరం తాజాగా మరోసారి ట్రంప్ స్పందించారు. ఇరాన్‌లో ఒక నాయకుడు కాదు, చాలా మంది నేతలతో యూఎస్ మాట్లాడుతోందని ఆయన తెలిపారు. చర్చలకు చొరవ తీసుకున్నది కూడా తాను కాదని, రెండో వైపు నుంచే ప్రతిపాదన వచ్చిందని అన్నారు. 'నేను వారిని పిలవలేదు. వారే మాట్లాడారు. ఒక డీల్ కుదుర్చుకోవాలని కోరుకుంటునట్టు చెప్పారు. అందుకు మేము కూడా సిద్ధంగానే ఉన్నామని చెప్పాం' అని మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. ఒక అగ్రనేతతో చర్చలు జరుగుతున్నాయని, అయితే ఆయన ఆదేశ సుప్రీం లీడర్‌తో మాత్రం కాదని అన్నారు. ఆయన గురించి ఎవరికీ తెలియదని, ఆయన బతికున్నారో లేదో కూడా తమకు తెలియదని చెప్పారు. ఆయన చనిపోవాలని కూడా తాను కోరుకోవడం లేదని, అయితే ప్రస్తుతం ఆ జాబ్ ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ఇరాన్‌లోని ఫేజ్`1 నాయకత్వం, ఫేజ్`2, ఫేజ్`3లో కూడా చాలామందిని తాము మట్టుబెట్టామని, అయితే అందరూ గౌరవించే ఒక నాయకుడితో తాము చర్చలు జరినట్టు చెప్పారు. ఆయన ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తీవ్రమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, మౌలిక వసతులపై 5 రోజుల పాటు దాడులు నిలిపివేయాలని తాను ఆదేశాలు జారీచేసినట్లు తన ట్రూత్ సోషల్ వి□డియాలో పోస్ట్ చేశారు. రెండ్రోజులుగా వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, చర్చలు సజావుగా, నిర్మాణాత్మకంగా ఉన్నాయని చెప్పారు. ఇరాన్ ` అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారంలోకి చేరుకోగా, తొలిసారి ట్రంప్ ప్రకటనతో ఉద్రిక్తతలు తగ్గేందుకు అవకాశాలున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికి ముందు, చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం ఇచ్చారు. లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఆ గడువు ముగుస్తుండటంతో ట్రంప్ తాజాగా ఐదు రోజుల పాటు దాడులకు బ్రేక్ వేస్తున్నట్టు ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయని, వాటి ఫలితంపై ఆధారపడి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కాగా, ఏవైనా షరతులకు అంగీకరించడం కానీ లాంఛనంగా చర్చలు ప్రారంభం కావడంపై కానీ ఇంకా టెహ్రాన్ స్పందించలేదు.

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

' మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గింటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హావి□ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీష్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా రూ.12 వేల కోట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆరఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కగారు సమాధానం చెప్పాలని అన్నారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన సబ్జెక్టుపై కాదని చెప్పారు. ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు.

## భార్యపై అనుమానం.. ఆవేశంతో హత్యచేసిన భర్త

**రంగారెడ్డి, నినాదం:**

అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన మాట వినడం లేదని, ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను అత్యంత కిరాతకంగా చంపాడో భర్త. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తరలించి పొలాల్లో పడేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. హత్య కు సంబంధించిన పూర్తి వివరాలు సోమవారం షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఏసిపి లక్ష్మీనారాయణ మీడియాకు వివరించారు. పోలీసులు తెలిపిన ప్రకారం ఘటన వివరాల్లోకి వెళ్తే.. ?మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే ప్రాంతానికి చెందిన శోభ అలియాస్ శోభారాణి (33)ని నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం సజావుగా సాగిన వీరి సంసారంలో నర్సింలు మద్యానికి బానిస కావడంతో గొడవలు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక శోభ తన కుమార్తెతో కలిసి రంగారెడ్డిగూడెంలోని తన తల్లి వద్ద నివసిస్తోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు, ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు.?మాయమాటలతో పిలిపించి.. ?ఈ నెల 21న నీ కొడుక్కి సైకిల్ ఇప్పిస్తాను, మహబూబ్‌నగర్‌కు రా అని నర్సింలు శోభను నమ్మించి పిలిపించాడు. ఆమె తన కుమార్తెతో కలిసి రాగా, తన గదికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. అక్కడ మళ్లీ గొడవ జరగడంతో, ముందే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ??హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేశాడు. అర్ధరాత్రి సమయంలో శోభ మృతదేహాన్ని మూటకట్టి, బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు.

# రేపు జీవన్ రెడ్డి రాజీనామా..!

### రాజకీయ ప్రస్థానం

జగిత్యాల నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్ రెడ్డి, కరీంనగర్ లోక్‌సభ స్థానానికి కూడా పోటీ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు, తరువాత కూడా పార్టీకి అంకితభావంతో పనిచేశారు. 2014లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. కోట్ల ఆఫర్లు వచ్చినప్పటికీ పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. 2018లో ఓటమి చెందినప్పటికీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా శాసన మండలిలో పార్టీ తరఫున గళమెత్తారు. కాంగ్రెస్ పక్ష నేతగా కూడా కీలక పాత్ర పోషించారు.

### హామీలు – అమలు లేకపోవడం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు జీవన్ రెడ్డికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా, అమలు కాలేదనే అసంతృప్తి ఉంది. ఏఐసీసీ స్థాయిలో కూడా సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా, రెండు సంవత్సరాలుగా ఎలాంటి పురోగతి లేదని అనుచరులు విమర్శిస్తున్నారు. ఇటీవల కొంతమంది నేతలు రాజీనామా చేయవద్దని కోరినా, అది కేవలం పరామర్శ స్థాయిలోనే మిగిలిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఫిరాయింపుల ప్రభావం

రాష్ట్రంలో స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ, ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వడం పార్టీకి ప్రతికూలంగా మారిందని అభిప్రాయం. సీనియర్లను పక్కన పెట్టడం, ఫిరాయింపు నేతలకు అవకాశాలు కల్పించడం వల్ల కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగింది.

### ముందున్న దారి

బుధవారం రాజీనామా అనంతరం జీవన్ రెడ్డి తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వంపై ఆయన విమర్శలు వ్యక్తిగతంగా కాకుండా విధానపరంగా ఉండే అవకాశముంది.జీవన్ రెడ్డి రాజీనామా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీపై గట్టి ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన స్థానాన్ని భర్తీ చేయడం పార్టీకి సవాల్‌గా మారనుంది.



## తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ

సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపు అంశంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎనఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎనఎంసీ నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు.

# మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం



జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలో మీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆరఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్వేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే దిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆరఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఓర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు.

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

**నిందితులకు మూడురోజు పోలీస్ కస్టడీ**

**హైదరాబాద్, నినాదం:**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసుల అభ్యర్థనపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా, నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

**హైదరాబాద్, నినాదం:**

రిటైర్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము.. . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## దానం నాగేందర్ వ్యవహారంపై విచారణ


**నోటీసులు జారీ చేసిన హైకోర్టు**

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ తీర్పును కొట్టివేయాలని ఏలేటి పిటిషన్ దాఖలు చేశారు. బీఆరఎస్ పార్టీ నుంచి గెలిచిన దానం నాగేందర్.. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని న్యాయస్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసుకొచ్చారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

# ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్

**అనకాపల్లి, మార్చి 23(నినాదం):**

ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్



స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమి పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీలఎ□`లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మి మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీలఎ□`లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీలఎ□`లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ□`లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

# నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవు

## అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక










**నిజామాబాద్, మార్చి 23 (నినాధం బ్యూరో)**

విధి నిర్వహణలో ఎవరైనా కావాలని నిర్లక్ష్యానికి తావిస్తే, కేవలం సస్పెన్షన్ తోనే సరిపెట్టకుండా బాధ్యులైన వారిపై మరింత కఠిన చర్యలు చేపడతామని నిజామాబాద్ జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి స్పష్టం హెచ్చరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల సందర్భంగా ఎస్జీటీ ఉపాధ్యాయుడు వ్యవహరించిన తీరును కలెక్టర్ ప్రస్తావిస్తూ, పైవిధంగా హెచ్చరికలు చేశారు. ఎంతో బాధ్యతాయుతమైన విధుల్లో కొనసాగుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, నిర్లక్ష్యానికి తావిచ్చే వారిపై తప్పనిసరిగా కఠినమైన చర్యలు ఉంటాయని కరాఖండీగా తేల్చి చెప్పారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎక్కడ కూడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ తో పాటు సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసిల్దార్లు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలోకి సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లు తీసుకెళ్ళకుండా గట్టి పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. ఇదిలాఉండగా, ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆర్.డబ్ల్యూ.ఎస్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి ప్రజల అవసరాలకు సరిపడా శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎం.పీ.ఓలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అవసరమైన చోట చిన్న చిన్న మరమ్మతులను వెంటనే చేపట్టాలని, పైప్ లైన్ లీకేజీలు వంటి వాటిని యుద్ధప్రాతిపదికన నివారించాలని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో కుళాయి కనెక్షన్లు ఉండాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులపై మండల స్పెషల్ ఆఫీసర్లు నిశిత పరిశీలన జరపాలని, ముఖ్యంగా ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం తాగునీటి సరఫరాను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించేలా చొరవ చూపాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్లకు తక్షణమే 18 వేలు వేతనం పెంచాలి

### సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 23 (నినాదం)**

బీఆర్ టియు ఆధ్వర్యంలో నగరంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో కొనసాగుతున్న ఆశా వర్కర్ల సమ్మెకు సోమవారం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవా వర్కర్లు చేస్తున్న న్యాయమైన సమ్మెకు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల జీతాలను రూ.18,000 కు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కే సీ ఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఆశా వర్కర్ల జీతాలను 2,200 నుంచి 9,750 వరకు పెంచారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం మాత్రం వారి సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతి మహిళా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లకు చీరలు, భోజనాలతో గౌరవంగా సన్మానం చేసిన విషయాన్ని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆశా వర్కర్లను పట్టించుకునే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లను సర్వేలు, ఇతర కార్యక్రమాలకు వినియోగించుకుంటూ, వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఆశా వర్కర్ల జీతాలను తక్షణమే 18,000కు పెంచాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆశా వర్కర్లు పిలుపునిచ్చే ప్రతి ఆందోళనలో పాల్గొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## మూతపడిన పాఠశాల తాళాలు ఎంఈఓకు అప్పగింత

**గద్వాల ప్రతినిధి మార్చి 23( నినాదం)**



జోగులాంబ గద్వాల జిల్లా పైపాడు శివారు సంజీవరెడ్డి కాలనీ నందు 2005 సంవత్సరంలో విద్యార్థులు లేక మూత పడింది కీర్తి శేషులు రంగయ్య గారి మాణిక్య రెడ్డి సతీమణి ఆర్.సరోజమ్మ అట్టి పాఠశాల తాళాలను ఎంఈఓ నరసింహులు అప్పచెప్పారు. తమ సామానులు భద్రపరచి కబ్జాకు గురికాకుండా కాపాడారు. ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా మూతపడే పాఠశాల తమ అవసరాలకు ఉపయోగపడుతుందని ఆమెని అడిగిన వెంటనే స్పందించి తక్షణమే తాళాలు అప్పజెప్పినందుకుగాను ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు ఆమె తమ సామానులను భద్రపరచి కబ్జాకి గురి కాకుండా కాపాడినారని ఆయన అన్నారు. అలాగే రిటైర్ హెచ్ఎం విజయ పార్థసారథి రెడ్డి, తహసిల్దార్ రామ్మోహన్, సరైన సమయంలో దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ గారికి ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తర తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలి

### రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరిన ఎంపీ అర్వింద్

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 23 (నినాదం)**



ఉత్తర తెలంగాణకు సంబంధించిన ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అభ్యర్థించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కొన్ని అంశాలు ఇంకా నిర్ణయాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆయన మరోసారి సోమవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కలిసి పెండింగ్ పనులను దృష్టికి తీసుకెళ్లారు. నిజామాబాద్ జంక్షన్‌లో పిట్ లైన్, కోచింగ్ డిపో ఏర్పాటు, పలు రైళ్ల పొడగింపులు అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఆమోదం వంటి అంశాలు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని వీటికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నవీపేట్, ఇందల్వాయి వద్ద అదనంగా ఆర్ ఓబిలు, డిచ్ పల్లి, అమ్మక్కపేట వద్ద ఆర్ యు బి ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జానకంపేట్ వద్ద ఆర్ యు బి విస్తరణ చేపట్టాలని తెలిపారు. నిజామాబాద్, మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్ మీదుగా తిరుపతికి రైళ్లు, నిజామాబాద్ మీదుగా వందేభారత్ ట్రైన్లను రైళ్ల పొడిగింపు త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎంపీ అర్వింద్ రైల్వే మంత్రి ని కోరారు. కాగా తాము కోరినట్టుగా ఎడపల్లి వద్ద ఆర్ ఓ బి నిర్మాణం, డిచ్ పల్లి లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు, ఆర్మూర్ –ఆదిలాబాద్ రైల్వే లైన్ పనుల మంజూరు పట్ల ఆయన రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణలో నవోదయ విద్యాలయాల విస్తరణ పరిస్థితి ఏంటి?

### పెద్దపల్లి, మంచిర్యాలపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం, మార్చి 23 (నినాదం)**

దేశంలోని ప్రతి జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని కేంద్రం ప్రకటించినప్పటికీ, తెలంగాణలో ఆ లక్ష్యం ఇంకా పూర్తిగా అమలు కాలేదని, కొత్త జిల్లాల్లో నవోదయాల ఏర్పాటు ఎందుకు జరగడం లేదని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ప్రతిపాదనలు ఉన్నాయా? ఉంటే అవి ఏ దశలో ఉన్నాయో వివరించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో సోమవారం ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి సమాధానం ఇస్తూ దేశవ్యాప్తంగా నవోదయాల ప్రస్తుత పరిస్థితిని వివరించారు.



**తెలంగాణలో పరిమిత విస్తరణ**

దేశంలో 689 జవహర్ విద్యాలయాలు ఉండగా..తెలంగాణలో మాత్రం ఈ పథకం విస్తరణ పూర్తి కాలేదు. రాష్ట్రంలో 16 నవోదయ విద్యాలయాలు మాత్రమే మంజూరై, వాటిలో 15 ప్రస్తుతం పనిచేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, ఖమ్మం, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట తదితర జిల్లాల్లో ఇవి కొనసాగుతున్నాయి. అయినప్పటికీ మరికొన్ని జిల్లాలు ఇంకా ఈ అవకాశానికి దూరంగా ఉన్నాయి. కొత్త నవోదయాల మంజూరుపై కేంద్ర మంత్రి స్పష్టత ఇస్తూ. రాష్ట్ర ప్రభుత్వాలు భూమి ఉచితంగా కేటాయించడం, తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించడం వంటి షరతులు నెరవేరితేనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రతిపాదనలు కూడా ఈ ప్రమాణాలపైనే ఆధారపడి ఉన్నాయని వివరించారు.

## భూదాన్ భూముల కేసులో మరో నలుగురు కీలక నిందితులు అరెస్ట్

### టౌన్ ఏసీపీ రమణమూర్తి

**ఖమ్మం, మార్చి 23(నినాదం):**

ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూ ప్రాంతంలోని భూదాన్, ప్రభుత్వ భూములపై అక్రమ వ్యాపారాలకు, ఆక్రమణలకు పాల్పడిన వారి పై వివిధ సెక్షలపై వారిని అరెస్ట్ చేశారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసులో మరో నలుగురు కీలక నిందుతులైన 1.కల్తీ రామచంద్రయ్య 2. బాణాల లక్ష్మణ చారి 3. చిప్పనపల్లి వీరయ్య 4. కుంజా కృష్ణయ్య ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఆయా కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా ఈ కేసు లో ప్రధాన నిందుతులైన 1) పోలెబోయిన ముత్తయ్య, 2)బల్లి శ్రీనివాస్, 3)కొప్పెర వెంకన్న, 4)కొట్టే బసు,5) సంపంగి వెంకటాచలం, లను మెజిస్ట్రేట్ అనుమతి తో పోలీస్ కస్టడీపై తీసుకొచ్చి విచారించిన అనంతరం



సోమవారం తిరిగి జ్యుడీషియల్ రిమాండుకు తరలించడం జరిగిందని అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పదహారు (16) మంది నిందుతులను అరెస్ట్ చేయడం జరిగిందని, నిందుతుల అక్రమ అస్తులను గుర్తించి వాటిని చట్ట ప్రకారంగా స్వాధీనం పర్చుకొనుటకు ప్రక్రియ కొనసాగుతుందని ఏసీపీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సి ఐ భానుమూర్తి తదితరులు ఉన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుకు అధికారుల తక్షణ స్పందన

### డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయింపు

### పేద కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా అధికార యంత్రాంగం

**ఖమ్మం, మార్చి23(నినాదం ):**

ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుకు స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఆ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సోమవారం కేటాయించడం జరిగింది. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటకు చెందిన రాయల రమేశ్, సులోచన దంపతులు 20 ఏళ్ళ క్రితం ఖమ్మం నగరానికి వలస వచ్చారని, వీరి చిన్న కుమారుడు అజయ్ (18) మెదడు ఎదుగుదల లోపించి మంచానికే పరిమితమయ్యాడని, తమకు సొంత ఇల్లు లేని కారణంగా కిరాయి ఇండ్లు లభించక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, ఆ కుటుంబం నివాస సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన అధికారులు, ఆ కుటుంబానికి తక్షణ ఉపశమనం కలిగించేలా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. ఇట్టి విషయంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అల్లిపురంలోని డబుల్ బెడ్ రూంల సముదాయంలో బ్లాక్ నెంబర్ 5 నందు జి7 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయిస్తూ ఉత్తర్వులను రమేష్–సులోచన దంపతులకు సోమవారం అందజేశారు.జిల్లా పరిపాలన తక్షణ స్పందనతో ఆ కుటుంబానికి నూతన ఆశలు కలిగినట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలపై జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవకు ప్రజలు అభినందనలు తెలిపారు.

## ‘నీటి’ కష్టానికి చెక్..

### ఇచ్చిన హామీని నెరవేర్చిన కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి

**ఏండ్ల నాటి తాగునీటి సమస్యకు పరిష్కారం**

**స్వర్గీయ చింతలపూడి రామారావు పేరుతో ప్లాంట్ నిర్మాణం**

**స్థానిక నాయకుల సమక్షంలో భూమి పూజ**

**మా నమ్మకాన్ని వమ్ము చేయలేదంటూ గ్రామస్తులు భావోద్వేగం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి23(నినాదం)**

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం రాజకీయాల్లో అరుదైన విషయం. కానీ కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తన భర్త సాయి కుమార్‌తో కలిసి ఆ అరుదైన ఉదాహరణగా నిలిచారు. డివిజన్ పరిధిలోని దేగలమడుగు, లక్ష్మక్కపేట గ్రామాల్లో “నీళ్లు” అనేది ఒక సాధారణ అవసరం కాదు.. అది ప్రతి ఇంటి బాధ, ప్రతి రోజూ ఎదురయ్యే పరీక్ష. ఎండాకాలం వస్తే ఈ కష్టం వర్ణించలేనిది. ఇలాంటి పరిస్థితుల్లో “మీ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తాను… మీకు సురక్షితమైన తాగునీరు అందిస్తాను.” అని ఎన్నికల సమయంలో ఒక మాట వినిపించింది. ఆ మాట ఇచ్చింది 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి. ఆ మాటను కేవలం ఓటు కోసం ఇచ్చిన హామీగా కాకుండా, తన భర్త చింతలపూడి సాయికుమార్ సహకారంతో ప్రజల జీవితాలను మార్చే బాధ్యతగా తీసుకున్నారు ఆమె.

ఎన్నికలు పూర్తయ్యాక చాలా చోట్ల హామీలు కాగితాలకే పరిమితమవుతాయి. కానీ ఇక్కడ కథ భిన్నంగా మారింది. గెలిచిన కొద్ది కాలంలోనే ప్రజల కష్టాన్ని గుర్తుచేసుకుంటూ, వెంటనే చర్యలు ప్రారంభించారు. దేగలమడుగు గ్రామంలో ఇరు గ్రామాలకు ఉపయోగపడేలా సురక్షిత మంచినీటి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్లాంట్ నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదు… ఇది రెండు గ్రామాల భవిష్యత్తుకు పెట్టుబడి. ఇకపై నీటి కోసం పడే కష్టాలు తగ్గిపోవాలి, ప్రతి ఇంటికి ఆరోగ్యకరమైన తాగునీరు అందాలి అన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోంది.

స్వర్గీయ చింతలపూడి రామారావు పేరుమీద ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం ద్వారా సేవా భావాన్ని స్మరించడమే కాకుండా, సమాజానికి అంకితభావంతో పనిచేసే నాయకత్వానికి ఇది ప్రతీకగా నిలిచింది. భూమి పూజ కార్యక్రమం రోజు గ్రామంలో కనిపించిన దృశ్యం భావోద్వేగానికి గురిచేసింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పరిష్కారం మొదలైన ఆనందం ప్రజల కళ్లల్లో కనిపించింది. మహిళలు, వృద్ధులు, యువత అందరూ పెద్ద ఎత్తున హాజరై తమ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొని కార్పొరేటర్ దంపతులను అభినందించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించడం ఎంత ముఖ్యమో ఈ సందర్భం మరోసారి గుర్తు చేసింది.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మాజీ సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేశ్, కాంగ్రెస్, సీపీఎం శ్రేణులు, దేగలమడుగు, లక్ష్మక్కపేట ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గెలిచిన నెలలోనే ఎన్నికల హామీ నెరవేర్చుటకు శ్రీకారం చుట్టిన కార్పొరేటర్ దంపతులను, కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు అభినందించి వారి మంచినీటి సమస్య త్వరితగతిన పరిష్కరించిన కార్పొరేటర్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

## కలెక్టర్ గారు... కబ్జాకు గురవుతున్న పెద్ద వాగును రక్షించండి

### ఎంఎస్పి జిల్లా కన్వీనర్ రాజు మాదిగ

**గద్వాల బ్యూరో మార్చి 23 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ పరిధి కర్నూల్ రోడ్డు సర్వే నెంబర్ 688 అంచున గల పెద్ద వాగుపై కొందరు రియల్ ఎస్టేట్ చేసే బడా నాయకులు సుమారు రెండు ఎకరాలు పెద్దవాగును కబ్జా చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు గురైన స్థలాలను ఎన్నో మార్లు సోషల్ మీడియాలో వచ్చిన ఎలాగూ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టించుకోలేదు కనీసం కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ గారైన స్పందిస్తారేమో అని ఆశతో అయిజ ప్రజలు ఎదురుచూస్తున్నారని ఎం ఎస్ పి జిల్లా కన్వీనర్, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ పేర్కొన్నారు. ఇప్పుడు వేసవి కాలం కావడం తో వాగు లో నీళ్లు లేకపోవడం తో….వాగు లోని చెట్లు, ముళ్ల కంపలను తొలగించి అక్రమంగా పెద్ద వాగును రెండు,మూడుఎకరాల భూమి చదును చేసి, దాని చుట్టూ పోల్స్ పాతి కబ్జా కు పూనుకొన్నారు.ఇట్టి కబ్జా ను తొలింగించి, వాగు విస్తీర్ణం ను పరి రక్షించకపోతే రాబోయే వర్షాకాలం లో ఏమైనా వరద విపత్తు సంబవిస్తే అట్టి వాగు కు అతి సమీపంలో గల SC



కాలనీ కి ప్రమాదకరం గా మారుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అంతే కాకుండా చుట్టూ పక్కల పంట పొలాలు కూడా కోత కు గురవుతూ….. పంటలు కూడా నాశనం అవుతాయి.కావున జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి కబ్జాకు గురైన వాగును పరిశీలించి, సంబంధిత అధికారులతో పెద్ద వాగు ను కబ్జా కు గురి కాకుండా పరి రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారని ఆయన అన్నారు.

## జాతీయస్థాయి అవార్డు అందుకున్న బాల్కొండ సర్పంచ్

**ఆర్మూర్, మార్చి 23-( నినాదం):**

బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గం మైన బాల్కొండ (అల్లకొండ)మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గాండ్ల రాజేష్ కు జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ఇందుకు సంబదించిన వివరాలు ఇలా ఉన్నాయి." ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగ " జాతీయ సర్పంచ్ సంవాద్ ఆన్లైన్ పోటీలను 18 మార్చ్ నుండి 20 వరకు దేశ వ్యాప్తంగా సర్పంచులకు నిర్వహించిన " నీటి కంటే ముందు " (పాని కి పహలే) క్విజ్ పోటీలో బాల్కొండ సర్పంచ్ గాండ్ల రాజేష్ కు జాతీయ స్థాయిలో మూడవ స్థానం రావడం జరిగింది. ఇది ఇలా ఉండగా దేశ స్వతంత్రం అనంతరం మొట్ట మొదటి సారిగా యువతి యువకులను బాల్కొండ (అల్లకొండ) ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ పోటీలలో గ్రామ ప్రజలు డిగ్రీ, పి. జి, బి. టెక్ చదివిన విద్యా వంతుల్ని ఎంపిక చేయడం విశేషం.

**పలువురి హర్షం**

నిజామాబాదు జిల్లా పూర్వ అల్ల కొండ (బాల్కొండ) సర్పంచ్ గాండ్ల రాజేష్ కు జాతీయ స్థాయిలో మూడవ స్థానం వచ్చినందుకు, ఆంధ్రప్రదేశ్,తెలంగాణ నేషనల్ యూత్ ప్రాజెక్టు యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు అధ్యక్షులు మోతె రామా గౌడ్,చైర్మన్ వి. సత్య గౌడ్,సెక్రటరీ జనరల్ బ్రహ్మరౌతూ నర్సింగ్ రావు,అల్లకొండ జిల్లా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షులు గొల్ల మల్లేష్,అధ్యక్షులు భూసం సత్య నారాయణ, సంయుక్త కార్యదర్శులైన డాక్టర్. ప్రవన్ కుమార్, సుత్రావే సంతోష్ కుమార్, బి.నరేష్ కుమార్,గ్రామ యువకులు, విద్యార్థిని, విద్యార్థులు, మేధావులు, ప్రొఫెసర్లు, గ్రామ ప్రజలు హర్షాతిరేఖలు వ్యక్తం చేశారు.




## మోర్తాడ్‌లో వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభం





**ఆర్మూర్, మార్చి 23 (నినాదం):**

నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు గ్రామాలలో పాలన పట్ల, విధుల పట్ల, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే విధంగా, వార్డుల, గ్రామాల అభివృద్ధిపై గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు ప్రభుత్వం అందించే నిధులను, వివిధ శాఖల నుండి వచ్చే నిధులను ఎలా ఉపయోగించాలి, సమస్యలు ఎలా పరిష్కరించాలి 19 అంశాలపై సోమవారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామ రైతు వేదిక భవనంలో మండలంలోని ఆయా గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వార్డ్ సభ్యులకు ఏ.శ్రీకాంత్, జె. భరత్, స్వరూప్, ఎస్. సురేష్, ఏ.ప్రవీణ్ శిక్షక వార్డు సభ్యులకు 19 అంశాలపై క్షుణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులను ఎంపీడీవో, తిరుమల, ఎంపీ ఓ,శ్రీధర్ పర్యవేక్షించారు. ఈ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం కాగా శనివారం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. శిక్షణకు వచ్చే మండల వార్డు సభ్యులకు భోజన వసతి, పలు సదుపాయాలను మండల అధికారులు కల్పించారు.

# అడవులను కాపాడితేనే దేశం సురక్షితం



**ప్రాణ వాయువు కోసం పర్యావరణ పరిరక్షణ ముఖ్యం**
**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి బ్యూరో, మార్చి 23 (నినాదం) :** అడవులను కాపాడితేనే దేశం సుస్థిరంగా ఉంటుందని, ప్రాణ వాయువు కోసం పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, "మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలి" అని సూచించారు. "అటవీ సంరక్షణే దేశ సంరక్షణ" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిచ్చుకల సంరక్షణపై కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్ళు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, "ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. అడవులు, చెట్లు మన జీవనాధారాలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారిణి నిఖిత, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ప్రిన్సిపల్ తదితర అధికారులు పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో సారధి కళాకారులు తమ గీతాలతో "చెట్టూ చెట్టమ్మను నేను... చెట్టును నేనురా... మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ" వంటి నినాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అటవీ సంరక్షణ, పరిరక్షణ పోస్టర్ ఎస్పీ, కలెక్టర్ అటవీ శాఖ అధికారులు కలిసి ఆవిష్కరించారు.

# అనధికార నిర్మాణాల కూల్చివేత..

**ఐదు భవనాలపై కొరడా!**

**రాజేంద్రనగర్, మార్చి 23: (నినాదం):** అత్తాపూర్ సర్కిల్-20 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అనధికార నిర్మాణాలపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పరమారెడ్డి హిల్స్ ఫేజ్-×× ప్రాంతంలో మంజూరు చేసిన ప్లాన్లను ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై సోమవారం డెమోలిషన్, సీలింగ్ చర్యలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ విభాగం నిర్వహించిన తనిఖీల్లో పలువురు యజమానులు అనుమతించిన అంతస్తుల కంటే అదనంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ముఖ్యంగా సెట్‌బ్యాక్‌లు వదలకపోవడం, అనధికారికంగా సెల్లార్లు, పెంట్ హౌస్‌లు నిర్మించడంపై అధికారులు తీవ్రంగా స్పందించారు. ప్లాట్ నం.



12: అనుమతి లేని అదనపు అంతస్తు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనల కారణంగా కూల్చివేత. ప్లాట్ నం. 32: అనధికార సెల్లార్, 4వ అంతస్తు నిర్మాణంపై డెమోలిషన్ చర్యలు. ప్లాట్ నం. 6 ప్లాన్ ఉల్లంఘించి కట్టిన 3వ అంతస్తు, పెంట్ హౌస్‌లను తొలగించారు. ప్లాట్ నం. 57 & 42: భారీ ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు, రెండు భవనాలను సీజ్ చేశారు.

**కఠిన చర్యలు తప్పవు:**
**డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య**

ఈ సందర్భంగా అత్తాపూర్ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు చేపడితే జిహెచ్ఎంసి చట్టం 1955లోని సెక్షన్ 461(1) ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. "ప్రజలు భవన నిర్మాణ నిబంధనలను, ప్రభుత్వం ఆమోదించిన ప్రణాళికలను కచ్చితంగా పాటించాలి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**సిద్దిపేట మార్చి 23(నినాదం) :** తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని రిబెన్ కట్ చేసి వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేసారు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు ప్రవీణ్,సంతోష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధా రాములు,చందా సత్తయ్య,మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు అర్జున్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంది రాజు,షఫీ, బాల కృష్ణ,స్వామి చరణ్,వార్డ్ సభ్యులు భాను, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి,వెంకటేశం, స్వామి,రవీందర్,స్వామి,భాస్కర్, అంజి,శేఖర్,తదితరులు పాల్గొన్నారు



# బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలి

**వెంటనే బకాయిలను చెల్లించాలి**
**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, మార్చి 23 (నినాదం) :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 2026-27 ల్లో ఐదవ రోజు నిర్వహించిన ప్రశ్నోత్తరాలలో భాగంగా "రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు - పెండింగ్ బకాయిల చెల్లింపు" లపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల గొంతుకై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వివేకానందు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమకు అందాల్సిన బెనిఫిట్స్, బకాయిల చెల్లింపు పై ధర్నాలు చేస్తా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 30నుండి 40 సంవత్సరాలు తమ జీవితాన్ని ధారపోసి రాష్ట్ర అభివృద్ధిలో, రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యులై ప్రభుత్వం వద్ద రూపాయి, రూపాయి కూడ పెట్టుకున్న డబ్బులను చెల్లించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య



విధానాలతో ఉద్యోగులలో ఒక అభద్రత భావం ఏర్పడిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను చిన్న చూపు చూస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సిపిఎస్ విధానానికి బదులు ఓపిఎస్ విధానాన్ని తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినాక ఎక్కడ దాని ప్రస్తావనే లేదని వాపోయారు. గతంలోనే పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు పదివేల కోట్ల బకాయిలు ఉన్నట్లు ప్రభుత్వమే చెప్పింది, నెలకు 700 కోట్లు ఇస్తామన్న దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రిటైర్డ్ ఉద్యోగులు ప్రతిసారి కోర్టులను ఆశ్రయిస్తేనే, కోర్టు మార్గదర్శకత్వం లోనే బకాయిలను పొందే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 30 మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారు. ఇందులో భాగంగా ఉప ముఖ్యమంత్రి సొంత జిల్లా ఖమ్మం జిల్లాకు చెందిన మైసయ్య అనే పోలీసు ఉద్యోగి ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్ అందక, ఆరోగ్యం బాగా లేక చనిపోగా, జనగామ జిల్లాకు చెందిన శ్రీనివాస్ అనే ఉద్యోగి తమ గోడును మా నాయకులు హరీశ్ రావు దృష్టికి తీసుకురాగా హరీష్ రావు మాట్లాడిన తర్వాతనే 29 లక్షల రూపాయల బకాయిలను చెల్లించారు. ఇకనైనా ప్రభుత్వం పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు భరోసా ఇచ్చేలా "ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ - బకాయిల చెల్లింపు" లపై స్పష్టమైన సమాధానం చెప్పాలని సభ దృష్టికి తెచ్చారు.

# అక్రమ అరెస్టులకు భయపడం

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలోఅసెంబ్లీ ముట్టడి**
**బిజెపి కార్యకర్తలకు రాష్ట్ర కమిటీ పిలుపు**



**చేగుంట, రామయంపేట మార్చి 23 (నినాదం ) :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రామచంద్ర రావు పిలుపుమేరకు, అసెంబ్లీ ముట్టడికి, బయలుదేరిన ఉమ్మడి రామాయంపేట, మండలానికి సంబంధించిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను, అక్రమంగా అరెస్టు, చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటువంటి అరెస్టులు మమ్మల్ని ఆపలేవు అని ఆగ్రహం వ్యక్తపరిచారు. అదే విధంగా చేగుంట మండలం కేంద్రంలో బిజెపి



నాయకులు అధ్యక్షుడు ఎల్లారెడ్డి, చింతల భూపాల్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. చేగుంట మండల అధ్యక్షులు ఎల్లారెడ్డి, ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ దండ వైఖరి మోసపూరిత, వాగ్దానాలను ఆరు గారంటీలను, దొంగలు తొక్కిన ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, వెళ్తుంటే కాంగ్రెస్ కార్యకర్తలు లాగా, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం బాధాకరము, శోచనీయం, ఇటువంటి అక్రమ అరెస్టులు భారతీయ జనతా పార్టీని అడ్డుకోలేవు, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం ప్రశ్నిస్తాం, అని చేగుంట మండల అధ్యక్షుడు దొంతి ఎల్లారెడ్డి అన్నారు. అనంతరం భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కూడా ప్రజల ప్రక్షాళన ప్రజల కోసం పనిచేస్తుంది ఈ అక్రమ అరెస్టులను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ఉంటుందని బిజెపి నాయకులు తెలిపారు

# మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కుమార్తెలకు ఘోర రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్, మార్చి 23 (నినాదం):** నగర శివారులోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్‌పై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో ఆయన పెద్ద కుమార్తె పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

**ప్రమాదం జరిగిన తీరు**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, మాగంటి గోపినాథ్ కుమార్తెలు అక్షర, దిశర ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారు ఓఆర్ఆర్ పై వేగంగా వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. కారు వేగం ధాటికి వాహనం తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం.

**బాధితుల వివరాలు**

ప్రమాద సమయంలో కారులో ఉన్న ఇద్దరు సోదరీమణులు అక్షర తలకు శరీరానికి తీవ్ర



ఫైల్ ఫోటో

గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. దిశర చెల్లెలు అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయం నుండి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని AIG ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్షరకు అత్యవసర విభాగంలో (ICU) నిష్ణాతులైన వైద్యుల బృందం చికిత్స అందిస్తోంది. విషయం తెలిసిన వెంటనే మాగంటి గోపినాథ్ కుటుంబ సభ్యులు, అనుచరులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద సమయంలో కారు ఎంత వేగంతో ఉందనేది సీసీటీవీ దృశ్యాల ఆధారంగా విశ్లేషిస్తున్నారు. మాగంటి గోపినాథ్ కుటుంబం ఇప్పటికే ఒక విషాదంలో ఉండగా, ఇప్పుడు కుమార్తెల ప్రమాద వార్త వారిని మరింత దిగ్భ్రాంతికి గురిచేసింది. అక్షర త్వరగా కోలుకోవాలని అభిమానులు, కార్యకర్తలు ప్రార్థిస్తున్నారు.

# చెత్త రహిత నగరమే లక్ష్యం : డిసి సమ్మయ్య



**రాజేంద్రనగర్, మార్చి 23, (నినాదం):** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెత్త లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని జిహెచ్ఎంసి అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య అన్నారు. సోమవారం హైదరగూడ వార్డులోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల వద్ద ఉన్న తొలగించారు. ఈ సందర్భంగా సానిటేషన్ వర్కర్లు, ఆర్పీలు , ఎస్ఎఫ్ఏ , ఎస్ఎస్, సీఓలు, కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై చెత్త వేయకుండా, నేరుగా ఆటోలకే అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇంటి వద్దకు వచ్చే ఆటోలకు చెత్తను ఇవ్వని వారి ఇళ్లకు అధికారులు స్వయంగా వెళ్లి, చెత్త సేకరణ పట్ల అవగాహన కల్పించారు. అత్తాపూర్ సర్కిల్-20 పరిధిలోని అన్ని వార్డులలో ఈ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మార్చి 23 నుండి మార్చి 28 వరకు వారం రోజుల పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని డి సీ సమ్మయ్య వెల్లడించారు. అత్తాపూర్: పిల్లర్ నం. 137 ప్రాంతం హైదరగూడ: విజ్ఞాన్ జూనియర్ కళాశాల,హనుమాన్ ఆలయం, చింతలమెట్, శాస్త్రిపురం బస్ స్టాప్ ఎమ్మెల్యే నివాసం, లక్ష్మిగూడ నేహా పాయింట్, గగన్‌పహాడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి కుటుంబం తమ బాధ్యతగా భావించి, తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రతిరోజూ ఆటోలకు మాత్రమే అందించాలని ఉప కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో , తిరుపతి డి ఈ, ఎస్ డబ్ల్యూ ఎం , ఏఈ ఆశిష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు .

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్యం**
**ప్రజావాణిలో 49 దరఖాస్తులు**

**సంగారెడ్డి, మార్చి 23 :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి లో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన 49 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖ అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా



అధికారులకు వినిపించే ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక వేడుకలు

**నీలం మధు ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ సీతా రామచంద్రుని ఊరేగింపు**
**కేరళ మేళం, కథాకళి, శివ నృత్యాలు, ఆంజనేయుడి వేషధారణతో ఆకట్టుకున్న ఊరేగింపు ఉత్సవాలు..**
**మహిళలతో కలిసి ఆ శ్రీరాముని గీతాలకు కోలాటం ఆడిన నీలం దంపతులు..**





**పటాన్చెరు / మార్చి 23 / (నినాదం) :** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడవ రోజైన సోమవారం అత్యంత వైభవంగా కొనసాగాయి. సోమవారం ఉదయం నుండే ఆలయ ప్రాంగణం లో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గోపూజ, మూలమంత్ర అనుష్ఠానములు, పురుష సూక్త హవనములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీలం మధు దంపతులు స్వయంగా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, లోక కల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం సాయంత్రం జి టి న్ కాలనీ నుండి ఐలమ్మ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగిన విగ్రహాల ఊరేగింపు కనువిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలతో చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జై శ్రీ రామ్ నినాదాలతో పుర వీధులు భక్తిభావంతో పులకించిపోయాయి. కేరళ కళాకారుల విన్యాసాలు , శివ తాండవ నృత్యాలు, ఆంజనేయుడి వేషధారణ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి వారి విగ్రహాల ఊరేగింపు లో కేరళ నుండి ప్రత్యేకంగా రప్పించిన కళాకారుల చెండ మేళం గ్రామం అంతటా ప్రతిధ్వనించాయి. పురాణ గాథలను కళ్లకు కట్టేలా ప్రదర్శించిన కథాకళి నృత్యం, వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి, శివ తాండవ నృత్యాలు ఊరేగింపుకు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకుని వచ్చాయి. ఈ సందర్భంగా శ్రీ రామ భక్తి గీతాలకు నీలం మధు దంపతులు మహిళలతో కలిసి కోలాటం ఆడుతూ భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ గా జరిగిన ఈ ఊరేగింపు వేడుకలను గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు..

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌తో ప్రజా జీవనం అల్లకల్లోలం

**స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరమైన మనుగడ నీవెక్కడ**
**ఈ జవహర్ నగర్‌కు ఏమైంది? అంటూ బహిరంగ సభ**
**ఏళ్లకు పైగా నివసిస్తున్నాభూమిపై హక్కుల ఊసే లేదు?**
**క్రాంతి కళాబృందం వ్యవస్థాపకుడు వెంకటాచారి ఆధ్వర్యంలో సదస్సు**
**ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి విమలక్క**





**జవహర్ నగర్, మార్చి 23 (నినాదం):** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ దుర్వాసనతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారుతుందని స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరమైన జీవితం జవహర్ నగర్ ప్రజలకు లేదా? ఈ జవహర్ నగర్ కు ఏమైంది? అంటూ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి విమలక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో ఈ జవహర్ నగర్ కు ఏమైంది? అంటూ క్రాంతి కళాబృందం వ్యవస్థాపకుడు వెంకటాచారి ఆధ్వర్యంలో బహిరంగ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి విమలక్క హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుంచి గ్రేటర్ హైదరాబాదులో విలీనమైనా జవహర్ నగర్ అభివృద్ధికి నోచుకోవడం లేదని పాలకులే రియల్ బ్రోకర్లుగా అవతారం ఎత్తుతూ పేద ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. డంపింగ్ యార్డ్ రాంకీ సంస్థ ఆగడాలతో జవహర్ నగర్ లోని మూడు లక్షల జనాభా ఆరోగ్యం గాల్లో దీపమైందని ఏలనాటి నుండి నివాసం ఉంటున్న భూమిపై హక్కులు ప్రజలు పొందకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. మినీ భారత్ గా పేరుగాంచిన జవహర్ నగర్ అభివృద్ధిలో ఆమడ దూరంలో వెనుకబడి ఉందని, జవహర్ నగర్ లో ఎక్కువగా గరీబోళ్లే నివసిస్తున్నారని రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు వారి వని తెలిపారు. జవహర్ నగర్ లో గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం, చివరకు తినే తిండి కూడా కాలుష్యం అయిపోయిందని ఆవేదన వెలుబు చ్చారు. ప్రభుత్వాలు ప్రజలకు కనీస అవసరాలు తీర్చడంలో విఫలమయ్యాయని దుయ్యబట్టారు. జవహర్ నగర్ ను స్వచ్ఛ జవహర్ నగర్ గా మార్చకపోతే రాబోవు తరాలు మనము క్షమించవని తెలిపారు. డంపింగ్ యార్డ్ వల్ల జవహర్ నగరే కాక చుట్టుపక్కల ప్రాంతాలైన దమ్మాయిగూడ, నాగారం, అహ్మద్ గూడ, కీసర, రాంపల్లి, ఘట్కేసర్, చర్లపల్లి తదితర ప్రాంతాలు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా పాలకులు మేల్కొని జవహర్ నగర్ డంపింగ్ భూతం నుండి ప్రజలకు విముక్తి కలిగించి, స్వచ్ఛ జవహర్ నగర్ కు తోడ్పడాలని పిలుపునిచ్చారు. యువత మత్తులో తిరుగుతోందని 350 బెల్ట్ షాపులతో జవహర్ నగర్ పూర్తిగా మత్తుమయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విష వాయువుల నుండి స్వేచ్ఛ వాయువు దిశగా పోరాటం చేయాలని క్రాంతి కళాబృందం గలమెత్తిందని వెంకటాచారి తెలిపారు. జవహర్ నగర్ సమస్యలపై కళాకారులు పాట రూపంలో ధూమ్ ధాం ఆటపాటలతో గల మెత్తి ప్రభుత్వానికి వినిపించేలా ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, దరువు అంజన్న, మల్లెపూలశ్రీకాంత్ యాదవ్, దశరథ్, ఎస్.కె మీరా, నిర్మల, అశోక్, సుధాకర్ ,ముఖేష్, నిహారిక గౌడ్, శ్రీనివాస్, తిరుపతి, ఆంజనేయులు, ప్రకాష్, ప్రజా కళాకారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్


## క్షయతో 3 నిమిషాలకో
# ఇద్దరు మృతి

ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిమిషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోకపోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది.భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. 6-9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్ల ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసుకోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది.క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు.సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి.

సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి. వీటిని తీసుకుంటూ మద్యం సేవించడం వల్ల కాలేయంపై అదనపు భారం పెరుగుతుందని అంటున్నారు. ఏదేమైనా చికిత్స చేయించుకోవడం, వ్యాధిని గుర్తించడం, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడడం వంటి వాటి వల్ల వ్యాధిని అరికట్ట వచ్చని అంటున్నారు. కేంద్రం కూడా క్షయ నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

## యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు
### లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి



**న్యూఢిల్లీ,మార్చి23(నినాదం):** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్య ప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని,గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎలాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేక మంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం..

### దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం.. కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం




**న్యూఢిల్లీ,మార్చి23 (నినాదం):**నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమేఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎలాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలిం గ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియోలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికా ర్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానెల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చీత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్ల వచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ఐకానిక్ టవర్‌గా
# అసెంబ్లీ నిర్మాణం
### మంత్రి నారాయణ వెల్లడి



**అమరావతి,మార్చి23(నినాదం):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11వేలకోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

## ప్రత్యక్ష దేవతలు

కుటుంబ చక్ర గమనానికి..
నాన్న ఎండలో మారిపోతాడు
అమ్మ వంట పొయ్యి..
మంటలకు కమిలిపోతుంది !

నాన్న శ్రమ స్వేదమే..
సంసార ప్రగతి రథ ఇంధనం
అమ్మ చేతి వంట..
అమృత కలిపిన ప్రసాదం !

నాన్న కాయకష్టంతో కట్టిన ఇల్లు..
నాది అంటాడు కన్న బిడ్డ
పిల్లలు నిర్మించిన గృహాన్ని..
నాది అనడానికి ధైర్యం చేయడు నాన్న !

అమ్మనాన్న తినిపిస్తారు..
కొసిరి కొసిరి కన్నబిడ్డల కడుపు నిండా
వృద్ధాప్యంలో తల్లితండ్రులు..
కొడుకు కోడలి దయపై ఆధారపడతారు !

అత్తమామల్ని నిర్లక్ష్యం..
చేస్తుంది కోడలు పిల్ల
తన అమ్మానాన్నల్ని మాత్రం..
అన్న వదిన బాగా చూడాలని ఆశ పడుద్ది !

అమ్మనాన్నల తపన..
అవిశ్రాంత జీవన పోరాటం..
అర్థం జీర్ణం కావడానికి..
తండ్రి కావాలి నేటి కొడుకు !

**మధుపాలీ**
**9949700037**

# మండుతున్న హోర్ముజ్ జలసంధి

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వణికిస్తున్న చమురు మంటలు
### వ్యూహాత్మక చదరంగంలో ట్రంప్ అంచనాలు తప్పాయా?
### ఇరాన్ సైనిక వ్యూహాన్ని అమెరికా తక్కువ అంచనా వేసిందా?

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక-రాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం--- కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం.

కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది

**అమెరికా మొదట భావించిన కీలక అంచనా..**
ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ.

అమెరికా మరో పెద్ద పొరపాటు.



ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది.

చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు వి70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు వి100--వి113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది.

అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది--- మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి.

మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల---కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి.

అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది--- అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి--- కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది.

ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీ-లేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది.

ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది---త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవది---నాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది---చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం.

ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.
అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం---అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.

**-రామ కిష్టయ్య సంగన భట్ల ,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## నిశ్శబ్దం మాట్లాడిన రోజు...

పల్లె పేరు చిన్నవానిపల్లె. అక్కడ అందరికీ తెలిసిన ఒక అమ్మాయి – సీత. పుట్టుకతోనే మాట్లాడలేకపోయింది. అందుకే చాలా మంది ఆమెను పట్టించుకోరు... కొందరు కరుణతో చూస్తారు... కానీ నిజంగా ఆమె మనసును ఎవరూ అర్థం చేసుకోలేదు.
సీతకి మాటలేమీ లేవు... కానీ ఆమె హృదయం ప్రేమతో నిండిపోయి ఉండేది.
ఆమెకు చాలా ఇష్టం ఉన్నవి జంతువులు. పక్షులు, కుక్కలు, పిల్లులు... ఏ మూగ ప్రాణి అయినా ఆమె దగ్గరకు వస్తే, అది సురక్షితంగా అనిపించేది.
ఒక రోజు... గ్రామంలో ఓ చిన్న కుక్క గాయపడి పడిపోయింది. అందరూ చూసి వెళ్లిపోయారు.
"అది చనిపోతుంది" అని చెప్పి ఎవరూ పట్టించుకోలేదు.
కానీ సీత మాత్రం ఆగింది...
ఆమె మాటలు లేకుండా... తన చున్నీ చింపుకుని కుక్క గాయాన్ని కట్టింది. నీళ్లు ఇచ్చింది. తన చేతులతో తినిపించింది. రోజులు గడిచాయి... కుక్క మెల్లగా కోలుకుంది.
ఆ కుక్క పేరు ఆమె పెట్టింది, "చిన్ను".
ఆ రోజు నుంచి చిన్ను ఎక్కడ సీత ఉంటే అక్కడే ఉండేది.

**అనుకోని ఘటన...**

ఒక రాత్రి గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. సీత ఇంట్లో మంటలు చెలరేగాయి. అందరూ బయటకు పరుగులు తీశారు. కానీ సీత లోపలే చిక్కుకుంది...
ఆమె అరవలేదు ... సహాయం కోరలేదు...
అప్పుడు చిన్ను బయట గట్టిగా మొరుగుతూ... గ్రామస్తుల దృష్టిని ఆకర్షించింది.
చిన్ను తిరిగి తిరిగి అదే ఇంటి దగ్గరకు వెళ్లడంతో, అందరూ అనుమానం వచ్చి లోపలికి వెళ్లారు. సీతను రక్షించారు.
మారిన మనసులు
ఆ రోజు గ్రామం మొత్తం ఒక విషయం గ్రహించింది.
మాట్లాడలేని వాళ్లు బలహీనులు కాదు....
మూగ ప్రాణులు విలువలేని జీవులు కాదు
సీత తన మాటలతో కాదు... తన పనులతో అందరి మనసు గెలుచుకుంది.
ఆమెను ఇకపై ఎవరూ "మూగ అమ్మాయి" అని పిలవలేదు...
"మన సీత" అని గౌరవంగా పిలిచారు.
చిన్ను కూడా గ్రామంలో ఒక హీరోయిన్ అయింది.
మాటలు లేకపోయినా ప్రేమ మాట్లాడుతుంది
మనసు ఉన్నవాళ్లే నిజంగా "మాట్లాడేవాళ్లు"



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# ప్రాణాలను హరించే నిశ్శబ్ద దొంగ.. క్షయ

క్షయ (టీబీ) శతాబ్దాలుగా మనిషిని వెంటాడుతున్న అదృశ్య శత్రువు. 'మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియా ద్వారా గాలిలో వ్యాపించే ఈ వ్యాధి, ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిని సులభంగా లక్ష్యంగా చేసుకుంటుంది. ఊపిరితిత్తులతో పాటు ఇతర శరీర భాగాలకు కూడా విస్తరించే ఈ జబ్బును సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, బరువు తగ్గడం దీని ప్రాథమిక లక్షణాలు. నేడు ఇది పూర్తిగా నయమయ్యే వ్యాధే అయినప్పటికీ, సామాజిక అపోహలు, చికిత్స పట్ల నిర్లక్ష్యం వల్ల మన దేశంలో ఇదిఇంకా ప్రధానఆరోగ్య సమస్యగానే మిగిలిపోయింది. దీన్ని పారద్రోలాలంటే ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన తీసుకురావడమే ఏకైక మార్గం.

**మన దేశంలో టీబీ పరిస్థితి:**
ఇటీవల విడుదలైన 'గ్లోబల్ ట్యూబర్క్యులోసిస్ రిపోర్ట్ 2025' ప్రకారం, 2015లో ప్రతిలక్ష మందికి 237గా ఉన్న క్షయ కేసులు, 2024 నాటికి 187కి తగ్గాయి. ఇది దాదాపు 21శాతం తగ్గుదల. ప్రపంచ సగటు 12 శాతం కంటే మన దేశంలో ఇది రెట్టింపు వేగంతో తగ్గడం మన వైద్య వ్యవస్థ సాధించిన గొప్ప విజయం. మరణాల రేటుకూడా లక్ష జనాభాకు 28 నుంచి 21కి తగ్గింది. అయితే, ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మొత్తం టీబీ కేసుల్లో ఇప్పటికీ 25 శాతం, మందులకు లొంగని మొండి క్షయ కేసుల్లో 32 శాతం మనదేశం నుంచే ఉంటుండటం ఆందోళన కరం. ముఖ్యంగా యూపీ,మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ లాంటిప్రాంతాల్లో ఈవ్యాధి తీవ్రత అత్యధికంగా ఉంది. 2025 నాటికి క్షయరహితభారత్ లక్ష్యాన్ని మనంపూర్తిగా చేరుకోకపోయినా, మన ప్రయాణం సరైన దిశలోనే సాగుతోందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

**దేశ ఆర్థిక వ్యవస్థ పై క్షయ భారం:**
ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో అత్యధికులు 15 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న యువతే కావడం దేశానికి తీవ్ర నష్టం. ఇంటికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి క్షయ బారిన పడినప్పుడు, వేతనాల కోత వల్ల ఆ కుటుంబం ఆర్థికంగా కుప్పకూలుతుంది. ఇది నేరుగా దేశ ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకపక్క రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేసే ఖర్చులు వారిని పేదరికంలోకి నెట్టేస్తుంటే, మరోపక్క ప్రభుత్వం ఉచిత వైద్యం కోసం భారీగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. అప్పులు, పేదరికం, క్షయ ఒక విష వలయం గామారి సమాజపురోగతిని, ఆర్థిక వృద్ధిని అడ్డుకుంటున్నాయి.

**సవాళ్లు - పరిష్కారాలు:**
దేశంలో టీబీ నివారణకు 'మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీ' అతిపెద్ద సవాలు. జబ్బు కాస్త తగ్గగానే రోగులు మందులు వాడటం ఆపేయడం వల్ల, వారిలోని బ్యాక్టీరియా మందులను తట్టుకునే శక్తిని అంటే రెసిస్టెన్స్ పెంచుకుంటోంది. రెండవ సవాలు సామాజిక అపోహలు, వివక్ష. అంటరాని వ్యాధిగా చూస్తారనే భయంతో ముఖ్యంగా మహిళలు జబ్బును దాచడం వల్ల ఇది ఇతరులకు వేగంగా వ్యాపిస్తోంది. మూడవది పేదరికం వల్ల వచ్చే పౌష్టికాహార లోపం. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం 'డాట్స్' (డైరెక్ట్లీ అబ్జర్వ్ ట్రీట్‌మెంట్ షార్ట్ కోర్స్) విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలి. పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద రోగులకు ఆర్థిక సహాయాన్ని పకడ్బందీగా అందించాలి. వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే సరైన కౌన్సెలింగ్ ఇచ్చి, వారు మందులు మధ్యలో ఆపకుండా చూస్తే ఈ అడ్డంకులను అధిగమించవచ్చు.

**కొత్త సాంకేతికత - గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ:**
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో పనిచేసే పోర్టబుల్ ఎక్స్-రే మిషన్ల వల్ల ఇప్పుడు మారుమూల గ్రామాల్లో కూడా నిమిషాల వ్యవధిలో నివేదిక వస్తోంది. అలాగే, ట్రూనాట్, సీబీనాట్ లాంటి ఆధునిక పరికరాలు టీబీ బ్యాక్టీరియాను గుర్తించడమే కాకుండా, అది ఏ మందులకు లొంగుతుందో కూడా వెంటనే చెబుతున్నాయి. ఈఅద్భుతమైన సాంకేతికతకు గ్రామీణ స్థాయిలో 'ఆశా' కార్యకర్తల అంకితభావం తోడవడంతో, దేశంలో దాగి ఉన్న లక్షలాది కేసులను మనం వేగంగా వెలుగులోకి తీసుకురాగలుగుతున్నాం.

**క్షయ రహిత సమాజం కోసం సమిష్టి బాధ్యత:**
క్షయ వ్యాధి నిర్మూలన కేవలం ప్రభుత్వాలు, వైద్యుల బాధ్యత మాత్రమే కాదు, ఇది పౌరులందరి సమిష్టి సామాజికబాధ్యత. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచితంగాపరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం మన విధి. వ్యాధిగ్రస్తులను దూరం పెట్టకుండా వారికి మానసిక ధైర్యాన్ని, ప్రేమను పంచాలి. అవగాహన, క్రమశిక్షణ, ఆధునిక వైద్యం అనే ఆయుధాలతో ఈ మహమ్మారిని మనదేశం నుంచి శాశ్వతంగా తరిమికొట్టవచ్చు. ఒక్క అడుగు ముందుకేసి, ప్రతి ఒక్కరూ 'క్షయ రహిత సమాజం' కోసం నిబద్ధతతో కృషి చేద్దాం.



**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# గ్లాసుడు తాగితే చాలు!

## కాలేయాన్ని శుద్ధిచేసే క్యారెట్లు!



ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మన శరీరంలో 50కి పైగా విధులను నిర్వర్తించే ఒక ముఖ్యమైన అవయవం. హార్మోన్ల ఉత్పత్తి, ప్రోటీన్ల సంశ్లేషణ వంటివి కీలకమైన పనులు ఇది నిర్వర్తిస్తుంది. అయితే జీవనశైలి కారణంగా కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది.

మద్యం ,అధిక ప్రోటీన్ తీసుకునే వారు కాలేయంపై భారాన్ని పెంచి, దాని పనితీరును ప్రభావితం చేస్తుంది. కానీ కాలేయం పనితీరును మెరుగుపరచడానికి ఆయుర్వేదం కొన్ని మార్గాలను సూచిస్తుంది.

ముఖ్యంగా నేటి కాలంలో ఫ్యాటీ లివర్ సాధారణ సమస్యగా మారింది. తప్పుల ఆహారపు అలవాట్ల కారణంగా ఫ్యాటీ లివర్ సమస్య తలెత్తుంది. కానీ కాలేయాన్ని నిర్విషీకరణ చేసి, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటంలో కారెట్లు కీలకంగా పనిచేస్తాయి.

క్యారెట్లు, ఆపిల్ పండ్లు, ద్రాక్ష పండ్లు, పుదీనాను కలిపి జ్యూస్ తయారు చేసుకుని తాగాలి. అయితే ఈ జ్యూస్ తయారుచేసేటప్పుడు అందులో చక్కెర లేదా ఉప్పు కలపవద్దు. ఈ జ్యూస్‌ను



ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగాలి. ఈ జ్యూస్ ఫ్యాటీ లివర్‌కు మాత్రమే కాకుండా కామెర్లకు కూడా మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

క్యారెట్లు కాలేయ కణాలను బలపరిచి, వాటిని నష్టం నుంచి కాపాడతాయి. క్యారెట్లలోని పదార్థాలు కాలేయంపై ఉండే అధిక ఒత్తిడిని కూడా తగ్గిస్తాయి. యాపిల్స్‌లోని గుణాలు కాలేయ వాపును తగ్గించడంలో, కణాల పునరుత్పత్తిలో సహాయపడతాయి. ద్రాక్ష పండ్లు కాలేయంలో ఎంజైమ్‌లను పెంచుతాయి. ఇవి ప్రోటీన్ల జీర్ణక్రియ, సంశ్లేషణకు సహాయపడతాయి.

# నేటితో ఆఖరు..

## వరుస పండుగలతో ఆన్‌లైన్‌కు ఆటంకం..

**స్కీం సద్వినియోగంపై జిల్లాలో నీలినీడలు..**
**డ్రైవింగ్ లైసెన్స్ లేక దళారుల చుట్టూ పరుగులు**
**కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం ప్రదక్షణలు**
**జిల్లాకు 276 యూనిట్ల కేటాయింపు..**
**ప్రభుత్వ విధానం పట్ల మండిపడుతున్న దళిత సంఘాలు**
**ఇప్పటి వరకు దరఖాస్తు చేసింది 840 మాత్రమే..**

**భద్రాద్రికొత్తగూడెం ప్రతినిధి, మార్చి23 (నినాదం):** **జిల్లాలో ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. సామాజి కంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్కీమ్, ప్రాక్టికల్‌గా మాత్రం అర్థం లేని చర్యలుగా మారిందనే విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకంపై సరైన ప్రచారం లేకపోవడం, క్లిష్టమైన నిబంధనలు, సాంకేతిక లోపాలతో పాటు వారం రోజులే గడువు ఉండడం, అందులో ఎక్కువ రోజులు సెలవులు రావడం అన్ని కలిసివచ్చి లబ్దిదారులను పూర్తిగా నిరుత్సాహానికి గురిచేస్తున్నాయి.**

తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకా శాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్యచరణ ప్రణాళిక 2025-26 ప్రకటిం చింది. ఈ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతీ, యువ కులను ఆర్థికంగా నిలదొక్కుకునేలా 276 యూనిట్లు మంజూరు చేసింది. అందులో బ్యాంక్ లింకేజీ కింద 210 మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. పథకానికి దరఖాస్తు గడువు వారం రోజులే ఉండడం, వారం రోజుల్లో నాలుగు రోజులు సెలవులు రావడంతో దరఖాస్తుకు తగిన పత్రాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తడంతో లబ్దిదారుల నుంచి స్పందన ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఈ పథకానికి నేటితో ఆఖరు రోజు కావడం, ఇప్పటి వరకు 840 కేవలం దరఖాస్తులు మాత్రమే నమోదు కావడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా మారింది.

**వరుస పండుగలతో లబ్దిదారుల్లో నిరాశ..**

అర్హత ప్రమాణాల పేరిట పెట్టిన నిబంధనలు లబ్ధిదారులపై భారంగా మారాయి. కుల,



ఆదాయ, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి కావడంతో వరుస సెలవుల మూలంగా అనేక మంది నిజమైన అర్హులు స్కీమ్‌కు దూరమవుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే దరఖాస్తు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో, పేదలు దళారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా, వరుసగా వచ్చిన ఉగాది, రంజాన్ పండుగలతో పాటు ఆదివారం కూడా రావడంతో ఆన్‌లైన్ దరఖాస్తులకు లబ్దిదారులు అనేక అవస్థలు పడుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితిని మరింత దారుణంగా మార్చాయి. గడువు సమయంలోనే ఆన్‌లైన్ సేవలు సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.

**దరఖాస్తు చేసింది 840 మాత్రమే..**

జిల్లాకు కేవలం 276 యూనిట్లు మాత్రమే కేటాయించడం, అందులో 210 మాత్రమే బ్యాంకు లింకేజీ కింద మంజూరు చేయనుండడం కూడా తీవ్ర విమర్శలకు దారి తీసింది. అర్హుల సంఖ్య వేలల్లో ఉండగా ఈ పరిమితి కంటి తుడుపు చర్యగా ఉందని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. లబ్ది కొందరికే పరిమితం కావడంతో మిగిలిన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 840మంది మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా, 114 మంది మాత్రమే ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారు. అర్హత నిబంధనలను సడలించాలని, యూనిట్ల సంఖ్యను పెంచాలని, తక్షణమే దరఖాస్తు నమోదు తేదీని పొడిగించాలని పలు దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**దరఖాస్తుకు నేటితో ఆఖరు..**

ఈ నెల 17 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ నేటితో ముగియనున్నది. జిల్లా మొత్తం 276 యూనిట్ల గాను రూ.265.28 లక్షల సబ్సిడీతో ప్రణాళికలు తయారు చేసి రూ.లక్ష వరకు గాను 90% సబ్సిడీ, రూ.2 లక్షల గాను 80% సబ్సిడీ, రూ.2లక్షల నుండి రూ.4లక్షల వరకు 70% సబ్సిడీతో, రూ.4 లక్షలు ఆపైన ఎంచుకోదగిన పథకాలకు 60% సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణాలను అందజేయనున్నారు. జిల్లాలో బ్యాంక్ లింకేజీ కింద ఈవీ టూ వీలర్స్ 130, ఈవీ త్రీ వీలర్స్ 66, సోలార్ యూనివర్సిల్ పంప్ కంట్రోల్ 14, నాన్ బ్యాంక్ లింకేజీ కింద వేజ్ ఎంప్లాయిమెంట్ 53, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ 13 యూనిట్లు కలిపి 276 జిల్లాకు మంజూరు కానున్నాయి. మొత్తానికి, ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక మంచి ఉద్దేశంతో ప్రారంభమైనప్పటికీ, అమలు లోపాలు, అవ్యవస్థ, నిర్లక్ష్యం కారణంగా అది లక్షిత వర్గాలకు ఉపయోగపడని స్థితికి చేరింది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఈ స్కీమ్ పూర్తిగా విశ్వసనీయత కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అర్హులు సద్వినియోగం

### చేసుకోవాలి

ఆర్.ఉపేందర్, ఇడి, ఎస్సీ కార్పొరేషన్, భద్రాద్రి కొత్తగూడెం



ఈ పథకం ప్రధానంగా ఎంప్లాయ్‌మెంట్ కల్పించాలన్న ఉద్దేశ్యంతో రూపొందించింది. జొమాటో, స్విగ్గి, రాపిడో, ఊబర్ వంటి వాటిల్లో గిగ్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. 2011 ఎస్సీ జనాభా ప్రాతిపదికన జిల్లాకు 276 యూనిట్లు కేటాయించారు. అందులో దివ్యాంగులకు 5శాతం, మహిళలకు 33శాతం కేటాయింపులు ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు నమోదు చేసుకోవాలి. దరఖాస్తు చేసిన లబ్దిదారులు అప్లికేషన్ ఫామ్ మరియు హార్డ్ కాపీలని రూం నెంబర్ ఎస1, రెండవ అంతస్తు ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్, ఐడిఓసి కార్యాలయం నందు తప్పనిసరిగా అందజేయాలి.

పీఎఫ్ ఖాతాదారులకు పండుగలాంటి వార్త..

# త్వరలో బ్యాంక్ అకౌంట్లోకి డబ్బులు.. కేంద్రం డెసిషన్







ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. పీఎఫ్ అకౌంట్ ఇనాక్టివ్ అయి ఉండి డబ్బులు క్లెయిమ్ చేయనివారికి ఆటోమేటిక్‌గా నిధులను బదిలీ చేయనుంది.

పీఎఫ్ ఖాతాల్లో మిగిలిపోయిన సొమ్మును నేరుగా లబ్ధిదారుడి బ్యాంక్ అకౌంట్లో జమ చేయనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇప్పటివరకు పీఎఫ్ క్లెయిమ్ చేయాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం అధికారులు పరిశీలించి క్లెయిమ్ ప్రాసెస్ చేస్తారు. కానీ క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోకపోయినా ఇనాక్టివ్ ఖాతాల్లోని నగదును ఆటోమేషన్ విధానంలో సెటిల్ చేయనుంది. ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్లో క్లెయిమ్ చేయని సొమ్ము ఆటోమేటిక్‌గా జమ అవుతుంది. రూ.వెయ్యిలోపు బ్యాలెన్స్ ఉన్న ఖాతాలకు పైలట్ ప్రాజెక్టుగా నిధులను ఆటోసెటిల్మెంట్ చేయనుంది. ఆ తర్వాత మిగతా ఖాతాదారులకు కూడా జమ చేయనుంది. తొలి దశలో 8 లక్షల ఇనాక్టివ్ ఖాతాలను గుర్తించారు.


8 లక్షల పీఎఫ్ ఖాతాల్లో రూ.5,200 కోట్ల నిధులు ఉన్నాయి. వీటిల్లో 14 వేల ఖాతాల్లో రూ.5 లక్షలకుపైగా క్లెయిమ్ చేయని నగదు ఉంది. ఇక 31 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్ల బ్యాలెన్స్ నిరుపయోగం ఉంది. దీంతో వీటిని ఆటోమేషన్ పద్ధతిలో బ్యాంక్ అకౌంట్‌కు నేరుగా జమ చేయనుంది. త్వరలో ఈ కొత్త వ్యవస్థ ప్రవేశపెట్టనున్నారు. కాగా అకౌంట్ మూడేళ్లపాటు ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా, క్లెయిమ్ చేయకపోయినా ఇనాక్టివ్ అవుతుంది. ఇక 55 ఏళ్ల వయస్సులో రిటైర్మెంట్ అయితే.. మూడేళ్ల పాటు ఎలాంటి కాంట్రిబ్యూషన్ జమ కాకపోయినా ఇనాక్టివ్ అవుతుంది. వీటికి కేంద్రం నుంచి వడ్డీ జమ కాదు.

సెన్సెక్స్ 1800 పాయింట్లు పతనం..

# ఒక్క సెషన్‌లో 14లక్షల కోట్లు గాయబ్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీగా నష్టపో యాయి. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధరలు భారీగా పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతుండడం సూచీ లపై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 2 వేల పాయింట్ల మేర నష్టపోగా.నిఫ్టీ 22,500 పాయిం ట్ల మార్కు కాస్త ఎగువన ముగిసింది. ఒక్కరోజులోనే మదుపర్ల సంపద దాదాపు రూ.14 లక్షల కోట్లు ఆవిరై రూ.415 లక్షల కోట్లకు చేరిం ది. డాలరుతో రూపాయి మారకం విలువ తొలిసారి 94 మార్కు దాటి 94.01 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.

సెన్సెక్స్ ఉదయం 73,732.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,532.96) భారీ నష్టాల్లో ప్రారం భమైంది. రోజంతా నష్టాలు కొనసా గాయి. ఇంట్రాడేలో 72,558.44 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1836.57 పాయిం ట్ల నష్టంతో 72,696.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 601.85 పాయింట్ల నష్టంతో 22,512.65 వద్ద స్థిరప డింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొ రేషన్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా స్టాక్స్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. టైటాన్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్, ఇండిగో స్టాక్స్ ప్రధానంగా నష్టపోయా యి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 113.20 డాలర్ల వద్ద



కొనసాగుతుండగా.. బంగారం 4272 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**

**ముదురుతున్న యుద్ధం:** హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవకపోతే.. ఇరాన్ పవర్‌ప్లాంట్లపై దాడులు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అదే జరిగితే హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసేస్తామంటూ ఇరాన్ హెచ్చరికలు చేసింది. ప్రాం తీయ విద్యుత్ క్షేత్రాల పైనా దాడు లకు దిగుతామని హెచ్చరించింది. యుద్ధం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందన్న భయాలు మార్కెట్ల ను పడేశాయి.

**చమురు 110 డాలర్లపైనే:** యుద్ధం కారణంగా భారీగా పెరిగిన ముడి చమురు ధర గత కొన్ని రోజు లుగా 110 డాలర్లపైనే స్థిరంగా కొనసాగు తోంది. దీనివల్ల ద్రవ్యోల్బ ణం పెరిగి, వృద్ధి నెమ్మదిస్తుందన్న భయాలు ఉన్నాయి.


**రూపాయి:** డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా సరికొత్త కనిష్ఠాలను తాకుతోంది. చమురు ధరలు పెరగ డం, ఎఫ్ఐఐల విక్రయాలు రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నాయి. దీనివల్ల మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది.

**ఎఫ్ఐఐల విక్రయాలు:** ఉద్రిక్తతలు ప్రారంభమైన నాటి నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 20వ తేదీ వరకు 16 ట్రేడింగ్ సెషన్లలో విదేశీ మదుపర్లు దాదాపు రూ.లక్షకోట్ల విక్రయాలు చేపట్టారు. అంటే ఒక ట్రేడింగ్ అవం కు దాదాపు రూ.1000కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. శుక్రవారం కూడా రూ.5518 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయిం చారు.వీటితో పాటు అమెరికాలో 10 ఏళ్ల బాండ్లపై రాబడులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల పతనం వం టివీ మన మార్కెట్లపై ప్రభావం చూపా యి. ఇండిస్ట్రియల్ డీజిల్ ధరను ఏకం గా లీటరుకు రూ.22 చొప్పున పెంచ డంతో ఇన్‌ఫ్రా, కన్‌స్ట్రక్షన్, తయారీ యూనిట్లపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలూ ప్రతికూల సంకేతాలు పంపాయి.

# కలర్ చూడొద్దండోయ్..

# ద్రాక్ష తింటే ఒంట్లో జరిగేదిదే..!

**వేసవి కాలంలో ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను విరివిగా తింటారు. అవి మీ శరీరాన్ని తేమగా, తాజాగా ఉంచుతాయి. ఇలాంటి అద్భుతమైన జ్యూసీ పండ్లలో ద్రాక్ష ఒకటి. అనేక రంగులలో లభించే ద్రాక్షలు తీపిగా, పలుపుగా ఉంటాయి.. నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగు ద్రాక్ష.. మూడు కూడా పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. అందుకే.. వీటిని తినాలని చెబుతున్నారు డైటీషియన్లు.. ద్రాక్షలను వైన్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు (రెస్వెరాట్రాల్).. ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాపర్, ఫోలేట్, విటమిన్లు సి, ఎ, కె, బి వంటి ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి..**



**ద్రాక్ష తినడం వల్ల కలిగే లాభాలు..**

రోగనిరోధక వ్యవస్థ కోసం - ద్రాక్షలో విటమిన్ సి, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. అందువల్ల, మీ గనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ద్రాక్షను రెగ్యులర్ గా తినవచ్చు.

**మలబద్ధకాన్ని నివారిస్తుంది:** ద్రాక్షలో పీచుపదార్థం బాగా ఉంటుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది.

**అలసటను ఎదుర్కోవడానికి:** ద్రాక్షలో విటమిన్లు, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, రాగి ఉంటాయి. ఇవి మీ శరీరానికి శక్తిని అందించి, అలసటను తగ్గించడంలో సహాయపడతాయి.

**కళ్ళకు మేలు:** ద్రాక్షలో ఉండే పాలిఫెనాల్స్ -- రెస్వెరాట్రాల్, మాక్యులర్ డీజెనరేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్, వాపు, శుక్లాలు వంటి కంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. ద్రాక్షను తినడం అంధత్వాన్ని నివారించడంలో కూడా సహాయపడవచ్చు. అందువల్ల, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ద్రాక్షను తినవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు..

**రక్తంలో చక్కెర నియంత్రణ :** మధుమేహం ఉన్నవారికి ద్రాక్షపండ్లు కూడా మేలు చేస్తాయి. వాటికి మధుమేహ నిరోధక గుణాలు ఉన్నాయి.. అవి రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి.

**కొలెస్ట్రాల్ తగ్గించుకోవడానికి :** మీరు ద్రాక్షపండ్లను తినడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. ద్రాక్ష రసంలో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి.


**ఎముకలను బలపరుస్తుంది:** ద్రాక్షలో రాగి, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచి, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపోరోసిస్) ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**క్యాన్సర్ చికిత్స కోసం:** ద్రాక్షలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి.

**గుండె జబ్బుల నుంచి రక్షణ కోసం :** ద్రాక్షలో ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్ ఆమ్లాలు, రెస్వెరాట్రాల్ ఉంటాయి. ఇవి గుండె జబ్బుల నుండి రక్షించడంలో సహాయపడతాయి.

అందుకే ద్రాక్షాలను రెగ్యులర్ గా తినాలని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.





# ఒక్కరోజే రూ.10 వేలు డౌన్

# ఊహించని రీతిలో బంగారం ధర పతనం..

పూటపూటకీ బంగారం ధరలు ఊహించని రీతిలో పతనమవుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధభయాలు, ద్రవ్యోల్బణం, పెట్టుబడులు కొనసాగిస్తే నష్టాలు వస్తాయన్న సమీకరణాల నేపథ్యంలో బంగారం ధరలు అమాంతం పడిపోతున్నాయి. సోమవారం ఉదయం 24 క్యారెట్ల బంగారంపై రూ.5950, 22 క్యారెట్ల బంగారంపై రూ.5450 పతనమవ్వగా.. సాయంత్రం మరోసారి బంగారం ధరలు తగ్గాయి. సాయంత్రం 4 గంటల తర్వాత 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాములపై రూ.4370 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.4000 పతనమైంది. దీంతో ఈ ఒక్కరోజే 24 క్యారెట్ల బంగారం రూ.10,320, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.9450 తగ్గింది. భారీగా బంగారం ధర తగ్గడంతో కొనుగోలుదారులు ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,35,650గా ఉండగా.. 22 బంగారం 10 గ్రాముల ధర రూ.1,24,350గా ఉంది. హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో స్వల్ప తేడాలతో బంగారం ధరలు దాదాపు ఈ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఈ ధరలకు తరుగు, జీఎస్టీ అదనంగా ఉంటుంది.

ఇదిలా ఉండగా..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ పై తాత్కాలికంగా యుద్ధం ఆపివేస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రభావం బంగారం ధరలపై ఉండే ఛాన్సుందని నిపుణులు చెప్తున్నారు. పెరుగుదల భారీగా ఉండకపోవచ్చు. అలాగే ఒక్కసారిగా పడిపోయే ఛాన్స్ కూడా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇరాన్ పై ఆంక్షలు మరింత పెంచినా, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరిగినా ధరలు మళ్లీ రికార్డు స్థాయికి చేరుకునే అవకాశం ఉందంటున్నారు. ఏదేమైనా బంగారంపై పెట్టుబడులు పెట్టేవారు ఇది ఆచితూచి వ్యవహరించాల్సిన సమయమనే చెప్పాలి.

## ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన

**150 మంది విద్యార్థినుల్లో అనీమియా గుర్తింపు**

**ఐఎంఏ ఆధ్వర్యంలోపోషకాహారం,**

**ఐరన్ మందుల పంపిణీ**



**కరీంనగర్, మార్చి 23(నినాదం):** కరీంనగర్‌లో ప్రపంచ రక్తహీనత దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మహిళల డిగ్రీ కళాశాలలో రక్తహీనత నిర్ధారణ, అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. సుమారు 300 మంది విద్యార్థినులు పరీక్షలు చేయించుకోగా, అందులో దాదాపు 150 మందికి రక్తహీ నత ఉన్నట్లు గుర్తించారు. వారికి తగిన చికిత్స అందించ డంతో పాటు ఐరన్ మాత్రలు, ఐరన్ సిరప్‌లు, ఐరన్ పుష్క లంగా ఉండే పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షురాలు డా. ఏ. శైలజ మహిళల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. కార్యదర్శి డా. ఎన్. మహేష్ బాబు రక్తహీనత లక్షణాలు, రక్త ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కోశాధికారి డా. వి. నీలిమ సరైన పోషకాహారం అవసరాన్ని వివరించారు. వైద్యురాలు డా. శ్రీలక్ష్మి రెడ్డి రక్తహీనత ప్రభావాలను వివరించగా, డా. నరేందర్ పటేల్ శ్వాసలో ఇబ్బంది సాధారణ లక్షణమని తెలిపారు. డా. జ్యోతి రక్తహీనత నివారణ, చికిత్సపై సూచనలు ఇచ్చారు. కార్య క్రమం నిర్వహణకు సహకరించిన కళాశాల యాజమాన్యం, నజియా మేడంకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



**జమ్మికుంట, మార్చి 23 (నినాదం) :** కరీంనగర్ జిల్లాకు తలమానికమైన అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతా రామచంద్రస్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. ఇల్లంద కుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి ప్రారంభమై ఏప్రిల్ ఆరో తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 27న జరగనున్న సీతారాముల కళ్యాణం సందర్భంగా ఏర్పాటుచేసిన కళ్యాణమంటపంతో పాటు భక్తుల కోసం ఏర్పాటు చేయనున్న గ్యాలరీలను పరిశీలించడంతోపాటు ట్రాఫిక్ సంబంధించిన నియమ నిబంధనలను గురించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణానికి తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతితో పాటు వైద్య సౌకర్యం ,టాయిలెట్ సౌకర్యం, ఏర్పాటు చేయాలన్నారు. దుమ్ము ధూళి లేవకుండా తగు చర్యలు తీసుకోవాలని కళ్యాణానికి వచ్చే భక్తుల పార్కింగ్ వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భక్తులు అంద రూ కళ్యాణాన్ని తిలకించేలా ఎల్ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేయాలని అన్నదానం చేసే చోట ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాల న్నారు. ఈ సంఘర్షణలో అడిష నల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ,అడిషనల్ లోకల్ బాడీ అశ్విని తానాజీ వాకర్డే, ఆర్డీవో రమేష్ ,ఏసీపీ మాధవి, ఎస్సై క్రాంతి కుమార్ తో పాటు వివిధ శాఖల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ శీతకాల శిబిరానికి ఆరంభం

**విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా వారం రోజుల కార్యక్రమాలు**

**వి.రవీందర్ రెడ్డి ఆల్ఫోర్స్ కరెస్పాండెంట్**



**కరీంనగర్, మార్చి 23(నినాదం):** చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వారం రోజుల శీతకాల శిబిరం సోమవారం ఉదయం ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు బి. వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, జాతీయ సేవా పథకం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని, "నేను నాకోసం కాదు, సమాజం కోసం" అనే భావనతో ప్రతి సేవకుడు పనిచేయాలని సూచించారు. శిబిరంలో పరిశుభ్రత, చెట్ల నాటకం, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ముఖ్య అతిథి వెంకటరమణ మాట్లాడుతూ, ఇలాంటి శిబిరాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, గ్రామ పరిస్థితులను అర్థం చేసుకొని సమాజ అభివృద్ధికి అవసరమైన జ్ఞానం పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి ముఖ్యంగా వేసవిలో తాగునీటి కొరతపై అవగాహన కల్పించాలని, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి చదువుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఎన్. రజిత, ఆంజనేయులు, ఎన్. సంతోష్, పి. విజయ, వాలంటీర్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### భగత్ సింగ్ స్ఫూర్తితో

## యువత మరో పోరాటానికి సిద్ధం కావాలి

**-భగత్ సింగ్ వర్ధంతి పురస్కరించుకొని నివాళులర్పించిన ఫార్వర్డ్ బ్లాక్ నేత**



**కరీంనగర్, మార్చి 23(నినాదం):** భగత్ సింగ్ స్ఫూర్తితో యువత మరో పోరాటం సిద్ధం కావాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రోజున భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించు కొని కరీంనగర్ నగరంలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ చూపిన ధైర్యం,త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యా యం, సమానత్వం కోసం భగత్ సింగ్ చేసిన పోరాటం నేటికీ ప్రాసంగికమని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్యా యం, అసమానతలపై యువత చైత న్యంతో ముందుకు రావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు అవసరమని సూచించారు. దేశ అభి వృద్ధి, ప్రజల హక్కుల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అంబటి జోజిరెడ్డి అన్నారు. భగత్ సింగ్ ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, యువజన సంఘాలు,సామాజిక సంస్థలు భగత్ సింగ్ జీవిత చరిత్రపై చర్చలు, వ్యాస రచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు..ప్రస్తుత సమాజంలో యువత భగత్ సింగ్ జీవితం నుండి ప్రేరణ పొందుతూ దేశాభివృద్ధికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, నగర అధ్యక్షుడు సత్య రావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బిఎస్పీ హుజురాబాద్ అసెంబ్లీ ఇన్చార్జిగా అంబాల ప్రభాకర్

**-పార్టీ బలోపేతానికి కృషి చేయండి**

**-బిఎస్పి జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్**



**జమ్మికుంట, మార్చి 23 (నినాదం):** బహుజన సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం హుజురాబాద్ లో సోమవారం ఏర్పాటు చేయగా జమ్మికుంట ప్రాంతానికి చెందిన డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) ను హుజురాబాద్ అసెంబ్లీ ఇన్చార్జిగా నియమించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్ మాట్లాడుతూ హుజురాబాద్ సెగ్మెంట్లో బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ నియామకం నేటి నుండి అమలులోకి వస్తుందని తెలిపారు. నూతనంగా నియామితులైన డాక్టర్ అంబాల ప్రభాకర్‌ను బిఎస్పి జోనల్ ఇంచార్జి దొడ్డే సమ్మయ్య, సీనియర్ నాయకులు దొడ్డే శ్రీనివాస్, మారపల్లి మొగిలయ్య, వేల్పుల మల్లేష్, పల్లె ప్రశాంత్ గౌడ్, కప్పల రవికుమార్ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, గిన్నారపు మహేందర్, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాస్ ఈదునూరి రమేష్, రాచపల్లి రమేష్, దాసరపు మహేందర్ కోరె రంజిత్, బత్తిని సాగర్ మారముల్ల సదయ్య, కండే తిరుపతి , మామిండ్ల మల్లయ్య, బీఎస్పీ సోషల్ మీడియా ఇన్చార్జ్ మంద జగన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆదర్శనగర్‌లో ఘనంగా ఈద్ మిలాప్

**-హిందూముస్లిం ఐక్యతకు వేదిక**




కరీంనగర్, మార్చి 23(నినాదం ) ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా నాయకులు మొహమ్మద్ బషీరుద్దీన్, మొహమ్మద్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం సమాజాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సోదరభావం, ఐక్యతను ప్రతిబింబించారు. కార్యక్రమం ద్వారా సమాజంలో పరస్పర గౌరవం, శాంతి, సామరస్యానికి సందేశం అందించారు. నగర ప్రముఖులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అతిథులను శాలువాలతో సన్మానించిన నిర్వాహకులు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న

## బిజెపి నాయకుల అరెస్టు




**జమ్మికుంట, మార్చి 23 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్ రావు చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు హైదరాబాద్ వెళుతున్న జమ్మికుంట బిజెపి నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈసందర్భంగా జమ్మికుంట బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప తెలంగాణ ప్రజలకు కానీ, రైతులకు కానీ, విద్యార్థులకు కానీ వృద్ధులకు కానీ ఏలాంటి ప్రయోజనం లేని బడ్జెట్ గా అభివర్ణించారు. ఈ బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారని, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలపడానికే ఈ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని బిజెపి పార్టీ చేపట్టిందని, దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రజాస్వామ్య గొంతుక అయిన ప్రతిపక్ష నేతలను ముందస్తు అరెస్టు చేసి ప్రశ్నించే గొంతుకలను అణిచి వేసేందుకు ఇలాంటి పిరికి చర్యలకు పాల్పడుతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున బిజెపి ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకూర్, మోడెం రాజు, రాజ పల్లి ప్రశాంత్ ,గుర్రం పరుశురాం, తూర్పాటి శంకర్, మేడిపల్లి మహేష్ పాల్గొన్నారు.

## కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నాగులమ్మ





**వైభవోపేతంగా నాగులమ్మ జాతర మహోత్సవం**

**దర్శించుకొని పూజలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల, మార్చి 23:** కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలిచే కోరుట్ల మండలంలోని నాగుల పేట నాగులమ్మ జాతర మహోత్సవం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. నాగులమ్మ జాతర మహోత్సవశీలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకు లు జువ్వాడి కృష్ణారావు హాజరై భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నాగులమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన జువ్వాడి కృష్ణారావు కు అర్చకులు బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, బ్రహ్మన్నగారి కిషన్ శర్మ వేదోక్తంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సం దర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ నాగులమ్మ అమ్మ దయ ఉంటే ప్రజలశీతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా సమృద్ధిగా వర్షాలు కురిసి పం టలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్లమండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు లు పెరుమాండ్ల సత్యనారాయణ, కోరుట్ల నియోజ కవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్, మంతెన గంగనర్సయ్య, నవీన్ రెడ్డి, స్వామి, వెంకటి, వెంకటేష్ గౌడ్, శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులపై

## తక్షణ చర్యలు తీసుకోవాలి

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మార్చి 23(నినాదం):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీ లించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 233 మంది అర్జీదారులు తమ వినతులు సమర్పించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మిగతావి సంబంధిత అధికారులకు పంపించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, విభాగీయ రెవెన్యూ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ధర్మారంలో లోకయుక్త అధికారుల విచారణ



**జమ్మికుంట, మార్చి 23 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 92 ,94 ,100 ప్రభుత్వ భూమిలో రోడ్లు ఏర్పాటు చేయుట గురించి గ్రామానికి చెందిన మంథని ప్రశాంత్ లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 92, 94, 100 లో గల నక్షలో రోడ్డు ఉన్నప్పటికీ కొంతమంది రోడ్డు ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, మాజీ ఏసీబీ రమణమూర్తి సోమవారం ఆ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గతంలో రెవెన్యూ అధికారులకు హద్దులు నిర్వహించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసుకున్నప్పటికీ హద్దులు నిర్ణయించ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా కాపాడవలసిన బాధ్యత అధికారులకు ఉందని పూర్తిస్థాయిలో కొలతలు వేయించి హద్దులు నిర్ణయించేలా చర్యలు చేపడతామని లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ పరిశీలనలో జమ్మికుంట తాసిల్దార్ వెంకట్ రెడ్డి తో పాటు సర్వేయర్ సత్యనారాయణ తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా హుజూరాబాద్‌లో

## రామకోటి పారాయణం



**హుజూరాబాద్,మార్చి 23(నినాదం) :** హుజూరాబాద్ పట్టణంలోని కే.సి క్యాంపులో ఏవియస్ కన్వెన్షన్ హాల్ నందు భక్తి పరవశంతో రామకోటి యజ్ఞం అత్యంత ఘనం గా నిర్వహించబడింది. ఈ యజ్ఞం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల సమక్షంలో విశేషంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ డాన్స్ మాస్టర్ శ్వేత సుమారు 650 మంది మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కార్యక్రమ విజయానికి తమ వంతు సహకారం అందించారని నిర్వాహకులు తెలిపారు.

**రామకోటి యజ్ఞం యొక్క ప్రాముఖ్యత**

హిందూ సంప్రదాయంలో 'రామ' నామస్మరణకు విశేషమైన స్థానం ఉంది. 'రామ' అనే నామాన్ని కోటి సార్లు జపించడం లేదా రాయడం ద్వారా మనసుకు శాంతి, ఆత్మశుద్ధి కలుగుతాయని విశ్వాసం. రామకోటి యజ్ఞం ద్వారా భక్తులు తమ భక్తిని వ్యక్తపరుచుకుంటూ, పాప విమోచనం పొందుతారని నమ్మకం ఉంది. అలాగే కుటుంబ శ్రేయస్సు, సౌఖ్యం, ఆధ్యాత్మిక పురోగతికి ఇది దోహదపడుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు రామనామ స్మరణతో ఆధ్యాత్మిక లోకంలో మునిగిపోయి, భక్తి భావాన్ని మరింతగా పెంపొందించుకున్నారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ రామకోటి యజ్ఞంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడంలో సహకరించిన భక్తులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ యజ్ఞంలో ఏవియస్ కన్వెన్షన్ సభ్యులు కౌన్సిలర్ గందె శ్రీనివాస్, సుద్దాల హరిశంకర్, గర్రెపల్లి శ్రీనివాస్, పుల్లూరి శ్రీకాంత్, బల్లు పున్నం, రేణుకుంట్ల సురేష్ మరియు ఆర్యవైశ్య నాయకులు నార్ల రాజేందర్, ఎస్ఆర్పీ శివనాథుని వేణుగోపాల్, కటుకం మారుతి, శివనాథుని శ్రీనివాస్, కటుకం శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.



### పదో తరగతి పరీక్షా కేంద్రాలపై

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**-విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు**



**కరీంనగర్, మార్చి 23:(నినాదం):** జిల్లాలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల సందర్భంగా కరీంనగర్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. సోమవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్ష నిర్వహణను పరిశీలించిన ఆమె, విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ద్రావణం వంటి అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తరగతి గదుల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చూసి, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇదే సమ యంలో, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హౌసింగ్ బోర్డు కాలనీ (కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లోని సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### మద్యం సేవించి

## వాహనం నడిపిన ఇద్దరికి వినూత్న శిక్ష

**జరిమానా చెల్లించలేకపోవడంతో సామాజిక సేవ చేయాలని కోర్టు ఆదేశం**



**కరీంనగర్, మార్చి 23(నినాదం):** కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనం నడిపి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరికి కోర్టు వినూత్న శిక్ష విధించింది. జరిమానా చెల్లించలేకపోవడంతో వారికి సామాజిక సేవ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రాజస్థాన్‌కు చెందిన తేజ్ సింగ్ (35) మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా, ఆయనపై విచారణ జరిపిన రెండవ తరగతి ప్రత్యేక న్యాయ మేజిస్ట్రేట్ డాక్టర్ ఈదుల లక్ష్మి రూ.2,000 జరిమానా విధించారు. అయితే ఆయన జరిమానా చెల్లించలేకపోవడంతో, మార్చి 23 నుండి నిర్ణీత రోజుల పాటు ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా తిమ్మాపూర్‌కు చెందిన బోనాల సాయికృష్ణపై కూడా మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో రూ.5,000 జరిమానా విధించగా, చెల్లించలేకపోవడంతో 6 రోజుల పాటు సామాజిక సేవ చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసం రూపొందించబడ్డాయని, వాటిని ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శివాలయం నిర్మాణానికి భారీ విరాళం

**-రూ. లక్ష 101 అందించిన విటల్ బ్రదర్స్**



**జమ్మికుంట, మార్చి 23 (నినాదం)** జమ్మికుంట మండలం లోని విలాసాగర్ గ్రామం లో నూతనంగా నిర్మిస్తు న్న శివాలయం నిర్మాణానికి జమ్మికుంట పట్ట ణానికి చెందిన ప్రముఖ వ్యాపారి విటల్ బ్రదర్స్ వారి తల్లిదండ్రులైన వెన్నంపల్లి వరమ్మ రాజమౌళి జ్ఞాపకార్థం ఒక లక్షా నూట ఒక రూపాయలను విరాళంగా అందజేశారు. విలాసాగర్ గ్రామం లో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందజేసి ఆ పరమశివుని కృపకు పాత్రులు కావాలని గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీధర్ తెలిపారు. విటల్ కుటుంబ సభ్యులు ఆనందం రాములు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

## ప్రజల అవసరం మేరకు సిలిండర్లు సరఫరా

## డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగిస్తే చర్యలు

## కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి





**వనపర్తి ప్రతినిధి, మార్చి 23(నినాదం):** జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజల డిమాండ్ మేరకు సకాలంలో సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ, రాజనగరం శివారులో ఉన్న వారి గోదామును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలో ఉన్న రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. మొత్తం కనెక్షన్లు, ప్రస్తుత సిలిండర్ల నిల్వ, రోజువారీ డిమాండ్, సరఫరా వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఏజెన్సీ మేనేజర్లను ప్రస్తుత స్టాక్, రోజువారీ డిమాండ్ గురించి కలెక్టర్ ఆరా తీశారు. స్పందించిన మేనేజర్లు ప్రస్తుతం గోదాంలో మొత్తం 1150 సిలిండర్ల నిల్వకు గానూ నేటి డిమాండ్ మేరకు 206 సిలిండర్లు సరఫరాకు పంపించామని, మిగిలిన 944 సిలిండర్లు గోదాంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, అందువల్ల ప్రజలు తొందరపడి సిలిండర్లు బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సిలిండర్ల సరఫరా విషయంలో ఎటువంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజలకు సమయానికి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు సకాలంలో సిలిండర్లు అందజేయాలని సూచించారు. ఇక జిల్లాలో డొమెస్టిక్ సిలిండర్లను ఎట్టి పరిస్థితుల్లో కమర్షియల్ గా వినియోగించడానికి వీలులేదని కలెక్టర్ హెచ్చరించారు. అలా ఎవరైనా నిబంధనలను అతిక్రమించిన ఎడల వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు డొమెస్టిక్ కనెక్షన్లు కమర్షియల్ గా వినియోగిస్తున్న వారి పట్ల చర్యలపై కలెక్టర్ ఆరా తీయగా, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ స్పందిస్తూ మొత్తం 25 మందిపై కేసులు నమోదు చేసి 50 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీటీలు పరమేష్, చక్రపాణి, ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వెయ్యి బీడీలకు 400 రూపాయల కూలీ ఇవ్వాలి



**అమరచింత, మార్చి 23 (నినాదం):** వెయ్యి బీడీలకు రూ:400 ఇవ్వాలని మండల ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు సంగెపాగు దాసు డిమాండ్ చేశారు. యాజమాన్యానికి కార్మికులకు గతంలో జరిగిన బీడీ కూలి ఒప్పందం ప్రకారం మార్చి నాటికి ముగుస్తుండడంతో సోమవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో నూతన వేతన ఒప్పందం గురించి బీడీ కార్మిక యాజమాన్యాలకు ఐ ఎన్ టి యు సి పలు డిమాండ్లతో నోటీసు అందజేశారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా బీడీ కూలి రేట్లు పెంచాలని , ఆకు జరిమానాల పద్ధతి ఎత్తివేయాలని, ప్రావిడెంట్ ఫండ్ లోని లోపాలను సరి చేయడానికి ఈ యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో బీడీ కార్మికులకు ఆసుపత్రి సదుపాయం కల్పించాలని తదితర డిమాండ్లతో చిన్న చింతకుంట లోని బీడి కంపెనీ యాజమాన్యాలకు నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటేరి బోరింగ్ శ్రీనివాసులు అమరచింత మండల నాయకులు పెద్ద బాలరాజు,జానిష్ట్,సవరన్న, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి కృషి చేయాలి



**కోదాడ,మార్చి 22(నినాదం):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతం కోసం రైతులు కృషి చేయాలని పిఐసి ఇన్చార్జ్ చడపంగు అంబేద్కర్ రైతులకు సూచించారు. సోమవారం గ్రామంలో సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోసైటీ ద్వారా రైతులకు ఇప్పటివరకు 6,18,56,131 రూపాయల రుణాలు అందించినట్టు, బ్యాంకుకు చెల్లించవలసిన అప్పు 3,31,17,636 రూపాయల మేరుగా ఉందని ఆయన తెలిపారు. అలాగే, సంఘం యొక్క నికర లాభం 2,87,38,494 రూపాయలు ఉన్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అతి చిన్న సొసైటీగా వ్యవహరిస్తున్న ఖానాపురం సహకార సంఘం, రైతులకు అవసరమైన వసతులను అందించడంలో ముందుండి పనిచేస్తోంది. రైతులు రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సంఘం అభివృద్ధికి తోడ్పడతారని ఆయన రైతులకు కు సూచించారు. చివరగా, రైతులకు మరింత సేవలను అందించేందుకు సంఘం సిద్ధంగా ఉందని చడపంగు అంబేద్కర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ లాజర్, ఉప సర్పంచ్ జగన్ సీఈవో నాగేశ్వరరావు, సిబ్బంది వీరయ్య, మాధవి, పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



**అమరచింత, మార్చి 23, (నినాదం):** ఆత్మకూరు మండలం బాలకిస్టాపూర్‌లో తుర్కకాష ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి రిలేషన్ షిప్ క్రికెట్ పోటీలు గత రెండు రోజులుగా జోరుగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలలో 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రికెట్ పోటీల్లో మొదటి విజేతకు 15016, రెండవ విజేతకు 8016లు నగదు తో పాటు షీల్డ్ అందజేస్తామని తెలిపారు. క్రికెట్ పోటీలకు తురక కాశ కమిటీ మొదటి బహుమతి, రెండవ బహుమతి సర్పంచ్ సత్యన్న దాతలుగా ముందుకు వచ్చారని తెలిపారు. ఈ రిలేషన్ షిప్ పోటీలను సజావుగా జరిగేందుకు సహకరిస్తున్న గ్రామ ప్రజలకు ఉపసర్పంచ్ సురేందర్ వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గఫూర్ జబ్బర్ హుస్సేన్ పాల్గొన్నారు.

# సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజల్లో తిరగనివ్వం

## ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంతో ఆందోళనలు చేస్తాం

## బిజెపి నేతలు పురుషోత్తంరెడ్డి పెద్దిరాజు ఆగ్రహం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 23(నినాదం):** ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజల్లో తిరగనివ్వబోమని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి, బిజెపి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు లు హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్ర రావు పిలుపు మేరకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అసెంబ్లీ సమీపానికి చేరుకున్న వనపర్తి జిల్లా నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి, వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు, 420 మోస పూరిత హామీలతో గద్దెనెక్కి 27 నెలలైనా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగస్తులం దరిని మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే గ్యారెంటీలు, హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజల తరఫున బిజెపి పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని, బిజెపి పిలుపుకు చెమటలు పట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగానే పోలీసులను ఉపయోగించి బలవంతంగా నాయకులను, కార్యకర్తలను అరెస్టుల పేరిట నిర్బంధించారని చెప్పారు. ప్రజా ఉద్యమాలను, ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంతో ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. అసెంబ్లీ ముట్టడిలో జోగులాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్. రామచంద్ర రెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షులు నలబోతుల అరవింద్, ఐటీసీ జిల్లా కన్వీనర్ అంజి యాదవ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఆగపోగు చాణుక్య, పట్టణ నాయకులు చంద్రశేఖర్, వరుణ్ కుమార్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## భూవివాదాల్లో పోలీసు జోక్యం పరిమితం..

### కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి

### ఎస్పీ డి.సునీతా రెడ్డి విజ్ఞప్తి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 23(నినాదం):** భూ వివాదాల్లో పోలీసు జోక్యం పరిమితం అని, కోర్టు ద్వారానే భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి12 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు అందించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా భూ సంబంధిత వివాదాలు సివిల్ స్వభావం కలిగినవిగా ఉండడంతో వాటిని కోర్టుల ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు. ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవడం చాలా ముఖ్యమని, భూ వివాదాల వంటి అంశాలు పోలీసు పరిధికి మించినవి అని, అలాంటి సమస్యల కోసం కోర్టును ఆశ్రయించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పోలీసుశాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ఎవరైనా మోసపూరిత చర్యలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు. ప్రజల భద్రత, న్యాయం మా ప్రధాన కర్తవ్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, న్యాయం లక్ష్యంగా పోలీసుశాఖ ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నేటి ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 4 భార్యభర్తల పిర్యాదులు,7 భూతగాదాల ఫిర్యాదులు,1 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని ఎస్పీ వివరించారు.

## వారసంత వేలం



**నూతనకల్, మార్చి 23 (నినాదం):** మండల పరిధిలోని మిర్యాల వారపు సంత(అంగడి)వేలం పాట రూ.14.32 లక్షలకు ఖరారైంది. ఎంపీవో శశికళ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంత వేలం పాటలో తొమ్మిది మంది పాల్గొన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించనున్న పశువులు,గొర్రెలు,మేకలు సంతకు నిర్వహించిన వేలం పాటను యమగాని రమేష్ రూ14.32 లక్షలకు దక్కించుకున్నాడు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నాగారం సీఐ నాగేశ్వరరావు, నూతనకల్, తుంగతుర్తి ఎస్సై నాగరాజు, క్రాంతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిం చారు. సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శిలు అనిల్,వెంకన్న, గంగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దరిపల్లి వీరన్న పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయాలి



**కమలాపూర్, మార్చి 23 (నినాదం):** బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపులో బాగంగా సోమవారం ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న కుండా మండల బిజెపి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు లు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలతో పాటుగా పలు హామీలు ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా వాటిని అమలు చేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిజెపి రాష్ట్ర పార్టీ ఛలో అసెంబ్లీ పిలుపునిచ్చారు అని తెలిపారు. ఛలో అసెంబ్లీలో కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తు అరెస్టులను తీవ్రంగా కండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటుగా హామీలన్నింటిని హమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి జిల్లా నాయకులు తుమ్మ శోభన్ బాబు, మాజి బిజెపి మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్ రెడ్డి,మార్క అశోక్,సర్పంచ్ శ్రీనివాస్,పిల్లి సతీష్ ఉన్నారు.

# అభివృద్ధి క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించాలి

## కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 23(నినాదం):** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అయన కలెక్టర్ కార్యాలయంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ సభలో ప్రభుత్వ ప్రాధామ్య పథకాలు, 6 గ్యారంటీలకు సంబంధించి గ్రామపంచాయతీ, మండల, మున్సిపల్,జిల్లా వారిగా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితాను తక్షణమే తయారు చేసి సిపిఓ కు సమర్పించాలి. మండల ప్రత్యేక అధికారులు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలను సందర్శించి ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి. జనగణనకు సంబంధించి తక్షణమే ఎన్యుమరేషన్ బ్లాక్ లను నిర్ణయించడంతోపాటు, సూపర్వైజర్ల తుది జాబితాను రూపొందించాలి. మిర్యాలగూడలో చేపట్టిన ఏబీసీ స్టెరిలైజేషన్ కేంద్రం పనులను వేగవంతం చేయాలి. మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ ప్రతిరోజు పనులు జరిగేలా చూడాలి. దేవరకొండ ఆర్డిఓ దేవరకొండలో ఏబి సి కేంద్రం ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలాన్ని చూడాలి. అందరూ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి అన్ని మేజర్ గ్రామపంచాయతీలు, అన్ని మున్సిపాలిటీలలో ఏబీసీల ఏర్పాటుకు స్థలాన్ని చూడాలి. కుక్కల రిహబిలిటేషన్ గాను నల్గొండ మున్సిపల్ కమిషనర్ నల్గొండలో కుక్కల షెల్టర్ ను ఏర్పాటు చేయాలి. ప్రత్యేకించి ప్రభుత్వ సంస్థల ఆవరణలలో సంచరించే కుక్కలకు సెంటర్లకు తరలించే ఏర్పాటు చేయాలి. 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఒక రోజు "దత్తత" కార్యక్రమాన్ని నిర్వహించి ఆవులు, కుక్కలను దత్తత ఇచ్చేలా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ చూడాలి. దీనికి మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ సహకార అందించాలని ఆదేశించారు .మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్ట్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# చెత్త వేరు చేస్తేనే పర్యావరణ రక్షణ సాధ్యం

- కొండాయిల్‌పల్లిలో విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన
- ఎంపీడీవో పసరగొండ రవి



**నల్లబెల్లి, మార్చి 23 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గ్రామీణ ప్రాంతాల్లో పరిశు భ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధించాలంటే ప్రతి కుటుంబం తడి--పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేయాల్సిన అవసరం ఉందని మండల పంచాయతీ అధికారి పసరగొండ రవి అన్నారు. నల్లబెల్లి మండలం కొండాయిల్‌పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో, పర్యావరణ విద్య మంత్రిత్వ శాఖ చేపట్టిన క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి, చెత్త వేరు చేసే విధానం, నిర్వహణ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తడి చెత్త (ఆహార అవశేషాలు, పండ్ల తొక్కలు, కూరగాయల మిగులు) పొడి చెత్త (ప్లాస్టిక్, కాగితం, లోహాలు)ను వేరు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు వివరించారు. తడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువు తయారు చేసి వ్యవసాయానికి వినియోగించవచ్చని, ఇది రైతులకు అదనపు లాభాన్ని అందిస్తుందని తెలిపారు. టీఎన్‌జీసీ కోఆర్డినేటర్ సూర్యకిరణ్, ఎస్‌బిఎం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎకో క్లబ్ ప్రతినిధులు చెత్త వర్గీకరణ పద్ధతులు, వాటి ప్రయోజనాలు, గ్రామ స్థాయిలో అమలు విధానంపై విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, పునర్వినియోగం (రీసైక్లింగ్) అవసరాన్ని కూడా వారు నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పసరగొండ రవి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ఒకరి బాధ్యత కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యమని అన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను వేరు చేయడం అలవాటు చేసుకుంటే గ్రామాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఎరుకల స్వప్న నరేష్, ఉప సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ, చెత్త వేరు చేయడం ద్వారా గ్రామ అభివృద్ధిసాధ్యమవుతుందని, ప్రతి గ్రామస్థుడు దీనిని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాలగిరి రజిత, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, వార్డ్ సభ్యులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం

## ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 23 (నినాదం):** జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 35 మంది ప్రజలు తమ వ్యక్తిగత,ఆర్థిక,భూ సంబంధిత సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఫిర్యాదును విని, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించాలని తెలిపారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులకు సూచనలు జారీ చేయడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత మరియు వేగం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

## ప్రజాదివాస్‌లో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(నినాదం):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమంలో పిర్యాదుదారుల నుండి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి : కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 23( నినాదం):** పదవ తరగతి పరీక్షలు ముగిసేవరకు కేంద్రాలలో వసతుల కల్పనలో ఎలాంటి లోపం ఉండకూడదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఉన్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మిఖంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు ఎప్పటిలాగే ఉండాలని,ప్రత్యేకించి తాగునీరు, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,టాయ్ లెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా కుండలలో తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేయాలని తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని,పూర్తి స్థాయిలో తనిఖీ తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రం లోకి పంపించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల హాజరు,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స లో భాగంగా ఏ ఎన్ ఎం తో మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



## ఎర్రటి ఎండ..
# ప్రయాణికులకు లేదు అండ

మండల కేంద్రంలో ప్రయాణికులకు ప్రధాన కూడళ్లు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపు 17 కి పైగా గ్రామాల ప్రజలు బస్సు కోసం వేచి ఉంటారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిలువ నీడ లేక, తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క ప్రయాణికులు అవసలు పడుతున్నారు. మూత్రశాలలు సైతం లేకపోవడంతో ఇంటికెళ్లే వరకు ఉగబట్టుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

– నూతనకల్, మార్చి 23 (నినాదం)

# పది పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా చర్యలు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, మార్చి 23 (నినాదం)**







జిల్లాలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విధానాన్ని పరిశీలించారు.పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ విచారణ చేయగా, మొత్తం 251 మంది విద్యార్థులకు గానూ, సోమవారం నిర్వహించిన ఆంగ్ల పరీక్షకు 250 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. విద్యార్థికి విద్యార్థికి మధ్య కనీస దూరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పరీక్షల నిర్వహణలో ఎటువంటి తప్పులు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, పరీక్ష కేంద్రం సిబ్బంది, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు
# అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల ప్రతినిధి మార్చి 23 (నినాదం)**



ప్రజావాణికి ప్రతి వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కరించకుండా అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసీ సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవో తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 56 ఆర్జీలు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్ లో ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణికి సంబంధించి 435 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. దరఖాస్తుదారులు అవసరమైన సందర్భాల్లో తమ ఆర్జీలకు సంబంధించిన రికార్డులు, ఇతర పత్రాలు తీసుకురాకుండా వస్తే ఆ సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోనూ వివిధ శాఖలకు సంబంధించి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవిన్యూ శాఖలో భూ సంబంధ సమస్యలపై వచ్చిన వందలాది ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతి బుధవారం ఆయా శాఖల జిల్లా అధికారులు తమ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న ఆర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సైతం తమ పరిధిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి వచ్చిన ఆర్జీలను పరిష్కరిస్తే చిన్న చిన్న సమస్యలకే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వారంలోగా షెడ్యూల్ ప్రకారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా కార్యాలయాల గదుల్లో అనవసరమైన ఫర్నిచర్, ఫైల్స్ కనిపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని, ప్రతి కార్యాలయం వద్ద బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పలు రంగాల్లో వెనుకబడిందని, జిల్లా పరిపాలన యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తేనే మన జిల్లా ఆయా రంగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు, ఆసుపత్రులను తమ పరిధిలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తరచు సందర్శిస్తూ అక్కడి పనితీరు మెరుగుపడేందుకు సహకరించాలన్నారు. ఈ అధికారులు ప్రతి శుక్రవారం విద్యార్థులతోపాటు గురుకుల విద్యాలయాల్లో భోజనం చేయాలని, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. ప్రతి బుధవారం 11:00 గంటలకు పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి

## ప్రత్యక్షంగా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 23, ( నినాదం):**

ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా మధ్యవర్తిత్వం లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# సుద్ద ముక్కపై మహనీయుల ప్రతిమలు



కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వేగలం నరేష్ చారి తన ప్రతిభతో మరోసారి ఆకట్టుకున్నారు. దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయులు రాజ్ గురు, భగత్ సింగ్, సుఖాదేవ్, ప్రతిమలను సుద్ద ముక్కపై " అద్భుతంగా చెక్కారు. ఇప్పటికే ఆయన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించగా, ఆయన ప్రతిభకు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**- కోదాడ,మార్చి 23(నినాదం):**



## స్పోర్ట్స్ స్టేడియం రిపేరింగ్ పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 23 ( నినాదం )**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంగారెడ్డి, నారాయణఖేడ్ స్టేడియంలలో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, యువజన సంక్షేమ & క్రీడాభివృద్ధి, విద్యాశాఖ, శిశు సంక్షేమ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం, నారాయణ ఖేడ్ స్పోర్ట్స్ స్టేడియం రిపేరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సంగారెడ్డిలో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి వెంటనే ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుతీకరణ, చిన్నపాటి మరమ్మత్తులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, పాఠశాలల కాంపౌండ్ వాల్స్, పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటును వేగవంతం చేయాలని తెలిపారు. కేటాయించిన బడ్జెట్‌ను వినియోగించి మార్చి 31లోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పూర్తయిన పనుల వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూఓ లలిత కుమారి, సీపీఓ బాలశౌరి, స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ బాలరాజ్, డీఈఓ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా

## 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్ బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షఉటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపికగామారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాకడ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.



# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

## ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి: గాయని మంగ్లీ



ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ఫైనాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.

## ట్రోలింగ్‌తో కొత్తలో
# చాలా బాధపడ్డ

థియేటర్లలో 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాతో తెరపై సందడి చేస్తున్నారు కథానాయికలు రాశీఖన్నా, శ్రీలీల. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వీరిద్దరు ట్రోలింగ్ గురించి తమ ఆలోచనల్ని పంచుకున్నారు. ''ట్రోలింగ్ వల్ల.. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో బాధపడేదాన్ని, ఏడ్చేదాన్ని.. ఒక్కోసారి అమ్మా నా వల్ల అవుతుందా? అని అంటూ వెళ్లిపోదామనుకున్నా. అప్పుడు చాలా సున్నితంగా ఉండేదాన్ని. కానీ, ఇప్పుడు అలా కాదు. సోషల్ మీడియాలో కొన్నిసార్లు ఏదైనా నెగిటివిటీని చూసినప్పుడు కొంతమంది ఇది నిజంకాదులే.. ఫేక్ అని కూడా తెలుసుకునేవారు ఉన్నారు. కానీ, నెగిటివిటీని చూస్తూ ఉంటే అది మన సొంత ఆలోచనల్ని కూడా క్రమంగా మార్చేస్తుంది''అని అంది శ్రీలీల.

NINADAM CINEMA

# ధురంధర్2 కలెక్షన్ల దూకుడు

## ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు



ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. ఢిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. 'ఇది 1998లో మా అమ్మనాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మనాన్నలకు ధన్యవాదాలు' అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. 'ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను' అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787